
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 9 జనవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 17.4

అంగన్‌వాడీ కేంద్రాల్లో
పారదర్శకత కోసం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నైజేషన్ (ముఖ కవళికల గుర్తింపు) ద్వారా లబ్ధిదారుల గుర్తింపునకు దశలవారీగా అడుగులుపడుతున్నాయి. ఇప్పటికే పోషణ్ అభియాన్ ట్రాకర్ అమలవుతుండగా, ఇందులో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతల ఫొటో తీయడం చేస్తున్నారు. అయితే టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్) తీసుకెళ్తున్న వారికి మాత్రం ఈ విధానం లేదు. ఈ నేపథ్యంలో టీహెచ్ఆర్ లబ్ధిదారులకు ఫేస్ రికగ్నైజేషన్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనంతరం దశలవారీగా అందరికీ దీన్ని వర్తింపజేయనున్నారు.

- (ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్)



- లబ్ధిదారులకు ఫేస్ రికగ్నైజేషన్
- మొదటగా టీహెచ్ఆర్ లబ్ధిదారులకు
- దశల వారీగా అందరికీ
- ఉమ్మడి జిల్లాలో 4,203 అంగన్‌వాడీ కేంద్రాలు



గర్భిణులు, బాలింతలు, పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం పంపిణీతో పాటు ప్రీస్కూల్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. లబ్ధిదారులందరికీ మెనూ ప్రకారం ప్రతి రోజూ ఇక్కడ ఆహార పదార్థాలు అందిస్తారు. పిల్లలకు అక్షరాభ్యాసంతో పాటు ఆటపాటలతో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, మూడేళ్ల పైబడిన పిల్లలు ప్రతీ రోజు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుండగా, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్) విధానంలో అంగన్‌వాడీ టీచర్లు ఆహార పదార్థాలు ఇంటికి ఇస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యంతో పాటు అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం నుంచి ప్రతీ రోజూ ఆయా కేంద్రాలకు హాజరైన పిల్లలు, ఆహార పదార్థాలను తినేందుకు వచ్చే బాలింతలు, గర్భిణుల ఫొటోలను సెల్ ఫోన్ ద్వారా పోషన్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో క్యాప్చర్ చేస్తున్నారు.అయితే టీహెచ్ఆర్ లబ్ధిదారులకుమాత్రం క్యాప్చర్ విధానం లేదు. అంతేగాక పిల్లల్లో శారీరక ఎదుగుదల లోపిస్తున్నట్లు ఇటీవలి రికార్డులు, సర్వేలు పేర్కొనడంతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని అమల్లో కి తెచ్చింది. ఈమేరకు తొలి దశలో టీహెచ్ఆర్ లబ్ధిదారుల జాబితాకు వారి ఫొటోలను ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ-కేవైసీ) విధానంలో జత చేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఈ-కేవైసీ నమోదు ప్రారంభమైంది.

ఈ-కేవైసీతో...

పోషన్ అభియాన్ ట్రాకర్‌లో అదనపు ఆప్షన్‌గా ప్రవేశపెట్టిన ఈ-కేవైసీతో లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అంది వారి ఆరోగ్యానికి దోహదపడడంతో పాటు ...

- మిగతా 7వ పేజీలో...



ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు ఇలా..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	0-3ఏళ్ల పిల్లలు	3-6ఏళ్ల పిల్లలు
నల్లగొండ	2,093	8,543	8,391	51,970	30,447
యాదాద్రి	901	4,046	4,356	26,102	19,446
సూర్యాపేట	1,209	5,459	4,741	30,372	19,525
మొత్తం	4,203	18,048	17,488	1,08,444	69,418

పోషన్ అభియాన్ ట్రాకర్ ప్రారంభంలోనే అంగన్‌వాడీ టీచర్లందరికీ ప్రభుత్వం స్మార్ట్ ఫోన్, ప్రత్యేక సిమ్ కార్డు అందజేసింది. అంగన్‌వాడీ కేంద్రం సమగ్ర వివరాలను సెల్ ఫోన్‌లోనే నమోదు చేస్తున్నారు.

అవగాహనా లోపం

గతంలో అంగన్‌వాడీ టీచర్లు 14 రికార్డులను రాయాల్సి ఉండేది. ఇప్పుడు ఆఫ్‌లైన్ పని గణనీయంగా తగ్గి ఆన్‌లైన్ నమోదు పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ-కేవైసీని అమలులోకి తేవడంతో టీహెచ్ఆర్ లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్‌ను అంగన్‌వాడీ టీచర్లు ప్రారంభించారు. కానీ, వారికి సూచనలు, సలహాలు మినహా శిక్షణ, అవగాహన కల్పించకపోవడంతో ఈ-కేవైసీ నమోదు ఇబ్బందికరంగా మారుతోంది. అలాగే పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య కూడా ఎదురవుతోంది. కానీ, ఈ-కేవైసీ డాటాపై పర్యవేక్షణ పేరుతో అధికారులు చేస్తున్న ఒత్తిడితో అంగన్‌టీచర్లు సతమతమవుతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా ఈ-కేవైసీ నమోదుపై శిక్షణ ఇవ్వాలని టీచర్లు కోరుతున్నారు.

రూ.622.91కోట్ల విలువైన
ధాన్యం కొనుగోళ్లు

- ప్రభుత్వ కేంద్రాల ద్వారా 2.68లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- అందులో 68,200 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం
- 95శాతం చెల్లింపులు పూర్తి
- రూ.27.19కోట్ల బోనస్ చెల్లింపు
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు



జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2,68,496 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.. మొత్తం రూ.622.91కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, ఇప్పటివరకు 95శాతం మేర అంటే రూ.587.81కోట్ల చెల్లింపులు చేశాం.. సన్నధాన్యం కొనుగోళ్లకు రూ.27.19కోట్ల బోనస్ రైతులకు చెల్లించామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ విశేషాలు ఇలా..

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఈ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం ఎంత?

వెంకటేశ్వర్లు: జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2,00,296 మెట్రిక్‌టన్నుల దొడ్డురకం ధాన్యం, 68,200 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కలిపి మొత్తం 2,68,496 మెట్రిక్ టన్నులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశాం.

ఆం: సన్నధాన్యం కొనుగోళ్లు ఎలా సాగాయి?

వెంకటేశ్వర్లు: జిల్లాలో సన్నధాన్యం కొనుగోళ్లకు 88 కేంద్రాలు ఏర్పాటు చేశాం. మొత్తం 68,200 మెట్రిక్ టన్నుల సన్నాలను ఈ కేంద్రాల ద్వారా సేకరించాం. అయితే మిల్‌పాయింట్ల వద్ద మరో 6లక్షల మెట్రిక్‌టన్నుల పైచిలుకు ధాన్యాన్ని రైతులు నేరుగా విక్రయించారు. మిల్లుల వద్ద రైతులు నష్టపోకుండా, ఇబ్బంది కలగకుండా గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నాం.

ఆం: ధాన్యం చెల్లింపులు పూర్తిస్థాయిలో పూర్తయినట్టేనా?

వెంకటేశ్వర్లు: ఈ సీజన్‌లో 51,347 మంది రైతుల నుంచి మొత్తం రూ.622.91కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాం. 95శాతం మేర చెల్లింపులు ఇప్పటికే పూర్తయ్యాయి. 48,148 మంది రైతులకు సంబంధించి రూ.587.81కోట్ల చెల్లింపులు పూర్తిచేశాం. ఇంకా కేవలం 5 శాతం మేర చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కూడా ప్రాసెస్‌లో ఉన్నాయి. వారం రోజుల్లో దాదాపు నూరు శాతం చెల్లింపులు పూర్తవుతాయి.

ఆం: సన్నరకాలకు బోనస్ పరిస్థితి ఏంటీ?

వెంకటేశ్వర్లు: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని విక్రయిస్తే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో సన్న ధాన్యం విక్రయించిన రైతులకు మొత్తం రూ.34.10కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికే రూ.27.19 కోట్లు రైతుల ఖాతాల్లో జమైంది. మిగిలిన బోనస్ కూడా రైతులకు త్వరలో అందుతుంది.

అతనెవరు?

- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం
- 'అతని పేరు చెబితే హడల్' కథనంపై అధికార, ఉద్యోగవర్గాల్లో ఆసక్తి
- ఇంటెలిజెన్స్ సైతం ఆరా



నల్లగొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సమాచారహక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ ఉద్యోగులను భయపెడుతూ వసూళ్లకు పాల్పడే ఉదంతాన్ని ఉన్నది ఉన్నట్లుగా ప్రచురించారని పలువురు అధికారులు, ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌చేసి ప్రశంసించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'అతని పేరు చెబితే హడల్' కథనం జిల్లా అధికారులు, ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. అవకవతవకలు, అవినీతికి పాల్పడ్డా, ప్రజాధనం దుర్వినియోగం చేసినా నిరభ్యంతరంగా తప్పును ఎత్తిచూపవచ్చని, చర్యలు కోరవచ్చని, అయితే ఈ సాకుతో వేధింపులకు పాల్పడితే ఎలా సహిస్తామని వ్యవసాయశాఖాధికారులు వాపోతున్నారు. వ్యవసాయశాఖలో పని చేసే ఉద్యోగులు, అధికారులే కాకుండా ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు సైతం ఈ కథనంపై ఆరా తీశారు. మరోవైపు ఈ కథనంలో పేర్కొన్న అంశాలు, బెదిరింపులపైనా పోలీస్ ఇంటెలిజెన్స్‌వర్గాలు ఆరా తీశాయి. అందులో భాగంగా ఉద్యోగులు, అధికారుల ద్వారా వివరాలు సేకరించారని, ఒకటి, రెండు రోజుల్లో నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు తెలిసింది.

సంక్రాంతికి బస్సులే బస్సులు

- రీజియన్‌లో 400 అదనపు బస్సులు నడపనున్న ఆర్టీసీ
- నేటి నుంచి 13 వరకు, తిరిగి 15 నుంచి 20వ తేదీ వరకు
- ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోల నుంచి బస్సులు



సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

పండుగకు పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చే ప్రయాణికులు అధికంగా ఉంటారు. వారిని దృష్టిలో పెట్టుకొని పండుగ ముందు రోజుల్లో హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాలకు వచ్చే బస్సుల సంఖ్యను పెంచారు. ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోల నుంచి ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్.బీనగర్, ఉప్పల్, ఐఎస్‌సదన్, సాగర్ రింగురోడ్డు ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ క్యాంపులు ఏర్పాటు చేసి అక్కడి నుంచి బస్సులను ఆపరేట్ చేయనున్నారు. రీజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది వీటిని పర్యవేక్షించనున్నారు. ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు, ఆ తరువాత తిరిగి 15 నుంచి 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 400 ప్రత్యేక బస్సులు నడిపేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర రాజధాని, సరిహద్దు జిల్లాలకు ఈ బస్సులు నడవనున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సుల సంఖ్యను ఆర్టీసీ అధికారులు పెంచారు. దసరా పండుగ సందర్భంలో మాత్రమే ప్రత్యేక బస్సులు నడిపే ఆర్టీసీ ఈసారి సంక్రాంతి పండుగకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక బస్సులను పెద్ద సంఖ్యలో నడిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రయాణికులకు సౌకర్యంతోపాటు ఆర్టీసీకి అధిక లాభాలు సమకూర్చేందుకు ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నాయి. రాష్ట్ర రాజధానితో పాటు ప్రధాన పట్టణాలు, జిల్లా కేంద్రాలు, మండలాలు, గ్రామాలకు పండుగ సందర్భంగా ప్రయాణికులు సొంత ఊళ్లకు వెళ్లేందుకు ఈ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. మరోవైపు విద్యా సంస్థలకు సెలవులు వస్తున్న నేపథ్యంతో పాటు పల్లెవెలుగులు, ఎక్స్‌ప్రెస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణం దృష్ట్యా రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచుతున్నారు. ఆయా డిపోల పరిధిలో ఎన్ని బస్సులు నడిపించాలనే దానిపై ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. ప్రత్యేక బస్సుల్లో ఎక్స్‌ప్రెస్‌లతో పాటు సూపర్..

- మిగతా 7వ పేజీలో...



దొంగతనాల నివారణకు
పటిష్ఠ నిఘా

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దొంగతనాల నివారణకు పటిష్ఠ నిఘా, ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దొంగతనాల నివారణకు పగలు, రాత్రి పటిష్ఠంగా గస్తీ నిర్వహించాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వారిపై నిఘా పెట్టాలన్నారు. ప్రతి కాలనీలోని ముఖ్యమైన కూడళ్లలో, రహదారుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు సైతం అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానం వస్తే వెంటనే సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందించాలని సూచించారు. ప్రజలు విలువైన వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని, సుదూర ప్రాంతాలకు వెళ్లే ముందు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్న సమయంలో అపరిచితులుచెప్పే సమాచారాన్ని నమ్మవద్దన్నారు. అత్యవసర సమయాల్లో సహాయం పొందేందుకు డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీ రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి



నల్లగొండ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మంత్రులు సీతక్క, కొండా సురేఖతో కలిసి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కొత్త విద్యుత్ పాలసీ కోసం ఇంధనశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ మధ్య కుదిరిన ఒప్పందంతో 1,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఒక్కో మెగావాట్‌కు నాలుగు ఎకరాల చొప్పున ప్రతీ జిల్లాలో కనీసం 100 నుంచి 150 ఎకరాలకు తగ్గకుండా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని ఇదివరకే కలెక్టర్లను ఆదేశించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు 11 ప్రాంతాల్లో 270 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్టు తెలిపారు. సదరు భూములను ఇప్పటికే రెవెన్యూ, ఫారెస్ట్, ఇతర అధికారులు ఉమ్మడిగా పరిశీలించినట్టు తెలిపారు. ఆదివారంలోగా మరోమారు పరిశీలించి ఆ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై నివేదిక అందజేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశమై పొవర్ ప్లాంట్లకు భూసేకరణపై సమీక్షించారు. వెంటనే సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు భూమిని గుర్తించడంతోపాటు, ఆర్థికపరమైన చేయూతకు బ్యాంకు అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడాలని అన్నారు. సమావేశంలో అటవీశాఖ జిల్లా అధికారి రాజశేఖర్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు, రెడ్‌కో జిల్లా మేనేజర్ ఎం.పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

(ఆంధ్రజ్యోతి, కేతేపల్లి): 'ధరణి' పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. బుధవారం కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ధరణి దరఖాస్తులు, మ్యుటేషన్, తదితర పెండింగ్ తదితర అంశాలను పరిశీలించారు. పారిశుధ్యం, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే డేటా ఎంట్రీపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ధరణి, ఇతర భూ సంబంధిత దరఖాస్తులు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. అవసరమైతే క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అదే సమయంలో ఎలాంటి సమస్యలేకున్నా పదేపదే ఫిర్యాదులతో వచ్చే బోగస్ దరఖాస్తుదారులపై కూడా దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, డీటీ సత్తార్, ఎంపీవో నాగలక్ష్మి, ఆర్ఐ చాంద్‌పాషా, తదితరులు ఉన్నారు.

పశుగణన సర్వేను పూర్తి చేయాలి

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఖాద్రీ




రికార్డులను తనిఖీచేస్తున్న జిల్లా పశువైద్యాధికారి ఖాద్రీ

మర్రిగూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పశుగణన సర్వేను ఫిబ్రవరి చివరి నాటికి వందశాతం పూర్తి చేయాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఖాద్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్య ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వైద్యసిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పశు వైద్య సేవలు అందించాలని సూచించారు. పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గత డిసెంబరులో పశువులు, గొర్రెలకు టీకాలు వేశామని, మిగిలిన జీవాలకు సైతం త్వరలో టీకాలు వేస్తామని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ సురేందర్, ఎల్లేష్, తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



చింతపల్లిలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న శ్రీనివాస్

చింతపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారిస్తే ఎలాంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండదన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, మండల వైద్యాధికారులు శ్రీదేవి, ఇక్బాల్, తదితరులు ఉన్నారు.

● ఇదిగో.. బోండా తెగ





అంతరించిపోతున్న గిరిజన జాతి బోండా తెగ జీవనశైలిపై ఒడిశా రాష్ట్రంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన వర్క్ షాప్‌లో నకిరేకల్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ మనోహర్ తీసిన ఫొటోకు జాతీయస్థాయి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మనోహర్‌ను ఎమ్మెల్యే వీరేశం సన్మానించారు.

● నకిరేకల్

భూనిర్వాసితులకు పునరావాసం

చితపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు కింద ముంపునకు గురైన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటుందని అడిషనల్ జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చింతపల్లిలో మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం, నర్సిరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా లబ్ధిదారులకు 289 ప్లాట్లు మంజూరు చేశామని, వీటిలో 257 ప్లాట్లు అందించినట్లు తెలిపారు. ప్రాజెక్టు పనుల్లో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం ఇళ్ల స్థలాలు అందించి భరోసా కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ద్వారా అన్ని గ్రామాలకు సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. రైతు సంక్షేమానికి ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్నామని అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, చింతపల్లి, మర్రిగూడ తహసీల్దార్లు రమకాంత్ శర్మ, బి.శ్రీనివాస్, ఆర్ఐ సునీత, ఈఈ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసం.. మాతృభూమిపై మమకారం

వారంతా ఉన్నత విద్యను అభ్యసించి అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు. ఉన్నత ఉద్యోగాలు చేస్తూ తమ ఆలోచనలకు పదునుపెట్టి అక్కడే వ్యాపారాన్ని ప్రారంభించి ఉన్నత స్థాయికి ఎదిగారు. అయితేనేం పుట్టిపెరిగిన ఊరును, చదివిన బడిని, కొలిచిన గుడిని, అభిమానం చూపే గ్రామస్థులను వారు మరువలేదు. ఎవరికో ఒకరికో ఒకరికి, ఏదో ఒక రూపంలో, సాయపడుతూనే పుట్టిన ఊరుపై తమకున్న ప్రేమను, మమకారాన్ని చాటుకుంటున్నారు. 'ఊరికి ఉపకారులు'గా తోచిన సాయం చేస్తున్నారు. ప్రవాసులుగా ఉంటున్నా స్వగ్రామాలపై మమకారాన్ని చాటుకుంటున్నారు.

● ఊరికి ఉపకారులు..పజ్జూరి సోదరులు

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం శాపల్లి గ్రామానికి చెందిన పజ్జూరి దామోదర్‌రెడ్డి సరోజన దంపతులది వ్యవసాయ కుటుంబం. దామోదర్‌రెడ్డి పెద్దగా చదవకపోయినా తన ముగ్గురు కుమారులు అనంత రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగాభవానిరెడ్డి, కుమార్తె సుధారాణిలను ఉన్నతంగా చదివించారు. దీంతో కుమారులు అమెరికాకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. అనంతరం అక్కడే చిన్నపాటివ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా ఎదిగారు. కొంతకాలం తర్వాత గంగాభవానీరెడ్డి స్వస్థలానికి తిరిగివచ్చారు. ఎదుటివారికి సాయం చేయాలని, వారిలోని ప్రతిభను గుర్తించి శక్తిమేర ప్రోత్సహించే తండ్రి గుణాన్నే ముగ్గురు సోదరులూ అనుసరించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడే ఎంతోమంది పేద విద్యార్థుల విద్యాభ్యాసం కోసం ఇతోధికంగా తోడ్పాటు నందించారు.



రూ.25 లక్షలతో తండ్రి పేరిట బడి

విద్యార్థులుగా తమ చిన్నతనంలో చదువు కోసం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి పడిన ఇబ్బందులు గ్రామంలోని తమ తర్వాతి తరం వారికి లేకుండా చూడాలని సంకల్పించారు. తండ్రి దామోదర్‌రెడ్డి పేరిట శాపల్లిలోనే జడ్పీ ఉన్నత పాఠశాలను 2014 విద్యాసంవత్సరంలో మంజూరు కాగా నక్కలపల్లికి వెళ్లే దారిలో గ్రామస్థుడు కరీంకు చెందిన 2.04ఎకరాల భూమిని పాఠశాల కోసం కొనుగోలు చేసి, ముగ్గురు సోదరులు కలిసి రూ.25లక్షలతో పాఠశాలను ప్రహరీతో కూడిన 6 తరగతి గదులను నిర్మించారు. దీనిని 'శ్రీ పజ్జూరి దామోదర్‌రెడ్డి స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల'గా మారుస్తూ ప్రభుత్వం జీవో నెం.11 పేరిట ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైమరీ స్కూల్‌కు ప్రహరీని కూడా కట్టించారు. ఇదిలా ఉంటే బడితో పాటు గ్రామంలోని తమ ఇలవేల్పు కమలాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధానరాజగోపురాన్ని రూ.15లక్షలతో పునఃనిర్మించారు. అదేవిధంగా గ్రామస్థులకు ఆర్‌వో సిస్టంతో నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటుచేశారు. ఇలా ఊరికి ఉపకారులుగా పజ్జూరి సోదరులు సేవలను కొనసాగిస్తున్నారు.



శాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తండ్రి పేరిట నిర్మించిన తరగతి గదులు

స్ప్రెడ్ ఇండియా పేరుతో శ్రీధర్‌రెడ్డి సేవలు



బాలెంల పాఠశాలలో డిజిటల్ క్లాసు రూంలను ప్రారంభిస్తున్న కలెక్టర్(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటరూరల్)

అమెరికాలో స్థిరపడిన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన పటేల్ శ్రీధర్‌రెడ్డి మాతృభూమికి సేవచేయాలనే సంకల్పంతో స్ప్రెడ్ స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. దాని ద్వారా పేద విద్యార్థులు, పేదలను అక్కున చేరుకుంటున్నారు. తాను చదువుకున్న పాఠశాలకు, సొంత గ్రామానికి సేవలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

రెండు దశాబ్దాలకు పైగా సేవలు

తనలా గ్రామ విద్యార్థులు విదేశాలకు వెళ్లి ఉన్నత స్థాయికి ఎదగాలని సంకల్పంతో 2003లో స్ప్రెడ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థను శ్రీధర్‌రెడ్డి స్థాపించారు. సంస్థ ద్వారా ఇప్పటివరకు సూర్యాపేట మండలంలో 100 అదనపు తరగతి గదుల నిర్మించారు. బాలెంల ఉన్నత పాఠశాలను మోడల్ పాఠశాల తీర్చిదిద్దేందుకు మూడు ప్రొజెక్టర్లు, కంప్యూటర్ ల్యాబ్, ప్రత్యేకమైన ల్యాప్‌టాప్‌లతో కార్పొరేట్ విద్య అందేలా కృషి చేస్తున్నారు. వసతిగృహాన్ని ఏర్పాటుచేసి భోజనవసతితో 40మంది అనాథపిల్లలకు విద్యనందిస్తున్నారు. క్రీడాప్రాంగణం కోసం రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి అప్పగించారు. గ్రామ మహిళలకు 30మందికి కుట్టుమిషన్లు ఇప్పించి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేసి వారికి జీవనోపాధి కల్పిస్తున్నారు. ప్రతి ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తున్నారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.50లక్షలు ఆర్థిక సహకారం అందజేశారు. సూర్యాపేట మండలం ఇమాంపేట కేజీబీవీ పాఠశాలలో రూ.10లక్షలతో 10గ్రీన్‌బోర్డులు, వాటర్‌ట్యాంక్, మౌలిక వసతులు తన సోదరుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి చేత ప్రారంభింపజేశారు. ఇటీవల బాలెంల పాఠశాలలో కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ చేతుల మీదుగా డిజిటల్ క్లాసురూంలను ప్రారంభించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా స్టడీసెంటర్‌ను ఏర్పాటుచేసి ముగ్గురు వలంటీర్లను నియమించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.

పేద విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకురావడమే లక్ష్యం



పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యఅందేలా ఏర్పాటు చేసి, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా లక్ష్యం. పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మాతృభూమి రుణం తీర్చుకోవడం కోసం ఎన్ని కోట్లు ఖర్చు చేసినా తక్కువే. స్ప్రెడ్ ఇండియా సేవలు పరిసర ప్రాంతాల్లో విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. బాలెంల గ్రామంలోని పాఠశాల రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలవాలి.

పటేల్ శ్రీధర్‌రెడ్డి, స్ప్రెడ్ ఇండియా వ్యవస్థాపకులు

సేవ గుణానికి మారుపేరు మంచికంటి



బోడంగిపర్తిలో నిర్మించిన కళాశాల



మంచికంటి లక్ష్మయ్య

(ఆంధ్రజ్యోతి-చండూరు రూరల్)

ఎక్కడ ఉన్నా, ఎంత స్థాయికి ఎదిగినా పుట్టిన గ్రామానికి సేవ చేయాలనే తలంపుతో చేసే సేవ అక్కడి ప్రజల్లో చిరకాలం ఉండిపోతోంది. అలాంటి సేవాగుణానికి మారుపేరులా నిలిచారు నల్లగొండ జిల్లా చండూరు మండలం బోడంగిపర్తి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ మంచికంటి లక్ష్మయ్య. ఆయన గ్రామానికి చేసిన సేవ పేద విద్యార్థుల, పేద ప్రజల మదిలో చిరకాలం నిలిచిపోయేలా చేసింది. తన తల్లి కోరిక నెరవేర్చేందుకు పుట్టిన ఊరు బోడంగిపర్తి గ్రామంలో సొంతంగా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మించి నిత్యపూజలు, దూప దీప నైవేద్యంతో సహా తన సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. నిరుపేద విద్యార్థులకు సైతం నాణ్యమైన ఉచిత విద్య అందించాలనే తన కల కోసం గ్రామంలో తన 7 ఎకరాల భూమిలో ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ విద్య అందించాలనే ఉద్యేశంతో మంచికంటి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల నిర్మించి ఉచిత విద్య అందిస్తున్నారు. నేటికీ అక్కడ ఎంతో మంది విద్యార్థుఽ విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారు.

లక్ష్మయ్య సహకారంతోనే చదివా...



నాకు చిన్నతనం నుంచే చదువంటే ఇష్టం. మాది పేదకుటుంబం కావడంతో మంచికంటి లక్ష్మయ్య ఏర్పాటుచేసిన పాఠశాల, జూనియర్ కళాశాలలో చదివా. లక్ష్మయ్యగారి స్ఫూర్తితో డాక్టర్ చదవాలని ధృడంగా నిశ్చయించుకుని కష్టపడి చదివి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ప్రస్తుతం దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్టుగా ప్రజలకు సేవలందిస్తున్నా. ఇదంతా మంచికంటి లక్ష్మయ్య పుణ్యమే. వారి గురించి ఎంతచెప్పినా తక్కువే.

డాక్టర్ స్వప్న వరికుప్పల, పూర్వ విద్యార్థిని, దేవరకొండ ప్రభుత్వ వైద్యురాలు

విద్యుదాఘతంతో వ్యక్తి మృతి



బానోతు తావు (ఫైల్)

మఠంపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని కొత్తతండాలో జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్ఐ బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తతండాకు చెందిన బానోతు తావు(43) తనకున్న రెండు ఎకరాల పొలానికి నీరు పెట్టేందుకు బుధవారం మధ్యాహ్నం పొలానికి వెళ్లాడు. మోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు 32కేవీ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాబు తెలిపారు. తావుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

సిమెంట్ కావాలని వచ్చి ఆన్‌లైన్ మోసం

దేవరకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో సైబర్ మోసం జరిగింది. స్థానిక రాజరాజేశ్వరీ సిమెంట్ దుకాణం వద్దకు బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి సిమెంట్ కావాలని వచ్చాడు. ఇంటి నిర్మాణం జరుగుతుంది, మా అన్నతో మీఫోన్ ద్వారా మాట్లాడి ఫోన్‌లో హాయ్ అనిపెడితే ఫోన్‌పే చేస్తాడని చెప్పి దుకాణ యజమాని రవిని నమ్మించాడు. రవి ఫోన్ ఓపెన్ చేసి ఆ వ్యక్తికి ఇచ్చాడు. వెంటనే ఫోన్ తీసుకున్న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ లింకు ఓపెన్ చేసి హాయ్ అని పెట్టి మళ్లీ వస్తానని చెప్పి బైక్‌పై వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తరువాత ఫోన్ ఓపెన్ చేసి చూసుకున్న దుకాణ యజమాని రవి ఖాతా నుంచి రూ.70వేలు డ్రాచేసినట్లు తేలడంతో ఆన్‌లైన్ మోసానికి గురయ్యానని గ్రహించాడు. విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమేష్ సీసీ కెమెరాల పుటేజ్, ఫోన్‌నెంబర్ ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు ఆకతాయిలకు ఒక్కరోజు శిక్ష

డిండి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):ముగ్గురు ఆకతాయిలకు నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రత్యేక కోర్టు ఒక్కరోజు శిక్ష విధించినట్లు ఎస్ఐ రాజు బుధవారం తెలిపారు. శిక్షలో భాగంగా కమ్యూనిటీ సర్వీస్ కింద కోర్టు ఆవరణ శుభ్రం చేయాలని ప్రత్యేక కోర్టు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.కందుకూరుకు చెందిన కోక అభిషేక్, బర్పటి జోసఫ్, ఇరగదిండ్ల శివాజీ ఈ నెల 3న మద్యం సేవించి గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై అకారణంగా దాడికి యత్నించారని ఎస్ఐ తెలిపారు.వారిపై కేసు నమోదు చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టడంతో స్పెషల్ కోర్టు శిక్ష విధించినట్లు తెలిపారు.

రూ.కోటిన్నరతో ఉడాయించిన వ్యాపారి

కోదాడ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడలో రూ.కోటిన్నరతో ఉడాయించాడు. కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోదాడలోని అనంతగిరి రోడ్డులో ఎనిమిది సంవత్సరాలుగా బుక్స్ ఫ్యాన్సీ షాపు వ్యాపారం నిర్వహిస్తున్నాడు. దీంతో ఆయన పట్టణంలో పలువురు వ్యాపారులతో పాటు అనేకమందితో పరిచయాలు పెంచుకున్నాడు. గత ఏడాది కాలంగా ఆయనకు పలువురు రైతులు, చిన్న వ్యాపారుల అప్పులు ఇచ్చారు. కాపుగల్లు గ్రామంలో బంధువులు, స్నేహితులు సుమారు 22 మంది వద్ద నుంచి రూ.80 లక్షలు, అదేవిధంగా కోదాడలోని 17 మంది వ్యాపారుల వద్ద నుంచి సుమారు రూ. 50 లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో పాటుగా అతడి షాపుకు సరుకులు సరఫరా చేసే వారికి కూడా సుమారు రూ.20 లక్షల బకాయి ఉన్నట్లు తెలిసింది. దీంతో అప్పులు పెరిగి, అప్పులిచ్చిన వారు తమ డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో వారంరోజుల కిందట దుకాణం మూసివేసి పరారయ్యాడు. అప్పులిచ్చిన వ్యక్తులు షాపు, ఇంటికి తాళం వేసి ఉండడంతో బంధువులు, స్నేహితుల వద్ద విచారించారు. నాలుగు రోజుల కిందట ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు వద్ద అతడిని పట్టుకున్నారు. దీంతో అతడిని తీసుకువచ్చి ఓ పెద్దమనిషికి అప్పజెప్పి పంచాయితీ పెట్టారు. దీంతో సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తానని బాధితులకు చెప్పాడు. పెద్దమనుషులకు అప్పజెప్పిన వ్యాపారి తిరిగి మరలా పరారయ్యాడు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై వారు పోలీస్ స్టేషన్ చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు.

'సాగర్'లో రెండో నెంబర్ టర్బైన్ సిద్ధం

● రూ. 30లక్షలతో మరమ్మతులు ● పనులు పూర్తి చేసిన జపాన్ ఇంజనీర్లు



నాగార్జునసాగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా జిల్లా నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని రెండో నెంబరు టర్బైన్ మరమ్మతులు పూర్తయ్యాయి. జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా, గత ఏడాది రెండో నంబరు టర్బైన్‌లోని రూటర్ స్పైడర్ మరమ్మతులకు లోనైంది. గత ఏడాది ఆగస్టులో సాగర్ ప్రాజెక్టుకు భారీ వరదలు రావడంతో ప్రాజెక్టు వారం రోజుల్లో పూర్తి స్థాయికి చేరుకుంది. నిండా నీళ్లున్నా రెండో నెంబర్ టర్బైన్ విద్యుదుత్పత్తికి వినియోగించకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబరు నెలలో ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించి, మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని జెన్‌కో అధికారులను ఆదేశించారు. నవంబరులో జపాన్ నుంచి టెక్నికల్ ఇంజనీర్లు రాగా, మరమ్మతుల పనులను ప్రారంభించి, పూర్తిచేశారు. బుధవారం నుంచి రెండో నంబరు టర్బైన్ నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభమైంది.

నెలన్నర రోజుల శ్రమించి మరమ్మతులు పూర్తి చేశాం: మంగేష్‌కుమార్, జెన్‌కో సీఈ

సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో మరమ్మతులకు గురైన రెండో నంబరు టర్బైన్‌ను నెలన్నర రోజుల పాటు శ్రమించి పూర్తి చేశాం. ఇందుకు రూ. 30లక్షలు ఖర్చు అయింది. ప్రస్తుతం ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఉన్న 8 టర్బైన్ల ద్వారా పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నాం.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

త్రిపురారం జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలో ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురైంది. బెజ్జికల్ గ్రామానికి చెందిన రైతు ఇంజం ధనలక్ష్మి గ్రామశివారులోని పొలం వద్ద ట్రాక్టర్ ట్రాలీని ఉంచారు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా ట్రాక్టర్ ట్రాలీ కనిపించలేదు. ట్రాలీ విలువ రూ.2లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

మహిళ అదృశ్యం

చౌటుప్పల్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో మహిళ అదృశ్యమైంది. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వివాహిత ధర్మాజీ గూడెంలోని ఓ పరిశ్రమలో భర్తతో కలిసి పని చేస్తుంది. వారం క్రితం ఆమె అదృశ్యమైంది. ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో భర్త పవన్‌కుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. అదేపరిశ్రమలో పనిచేసే మహేందర్ సింగ్ తన భార్యను తీసుకెళ్లినట్లు అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాంతాలు వేరైనా సంకల్పం ఒక్కటే

● సైకిల్‌యాత్ర చేస్తున్న యువకులు

(ఆంధ్రజ్యోతి-డిండి)

భారతదేశం మొత్తాన్ని సైకిల్‌పై చుట్టి రావాలని యువకులు సంకల్పించారు. ముగ్గురు యువకులు వేర్వేరు చోట్ల వేర్వేరు సమయాల్లో సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టినప్పటికీ అనుహ్యంగా ముగ్గురు కేరళలోని కొచ్చిలో కలిసి చేయి, చేయి కలిపి ఒక్కటిగా యాత్రకు సాగుతున్నారు. భాషలు, ప్రాంతాలు వేరైనా సమైక్యత, సౌభ్రాతృత్వమే తమ అభిమతం అంటూ ఆ యువకులు ముందుకు సాగుతున్నారు. సిక్కిం రాష్ట్రానికి చెందిన మిలాన్‌సుబ్బు, నేపాల్ దేశానికి చెందిన డానియెల్, బిహార్ రాష్ట్రానికి చెందిన సురజ్ సుమన్ బుధవారం ఉదయం సైకిల్‌పై జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ అల్పాహారం కోసం నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో కొద్దిసేపు ఆగారు.



దేశ యాత్రలో భాగంగా డిండికి చేరిన యువకులు

ఇప్పటికే 16 రాష్ట్రాల్లో పర్యటించా



మాది సిక్కిం రాష్ట్రం. సైకిల్‌పై దేశయాత్రను 11 జూలై 2024న పశ్చిమబెంగాల్ రాష్ట్రం సిల్‌గుడి నుంచి బయలుదేరా. సిక్కింలో కొండలు, గుట్టలు ఉండడం వల్ల సరిహద్దులోని సిల్‌గుడి నుంచి యాత్రచేపట్టా. ఇప్పటివరకు సిక్కిం రాష్ట్రం నుంచి దేశంలోని 28 రాష్ట్రాల్లో పర్యటించినవారులేరు. ఆ రికార్డును సొంతం చేసుకునేందుకే సైకిల్‌పై యాత్ర ప్రారంభించా. ప్రస్తుతం సిక్కిం అవాజ్ అనే దినపత్రికలో పనిచేస్తున్నా. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో 900 కిలోమీటర్లు ప్రయాణించి ఛత్తీస్‌ఘడ్ మీదుగా ఇక్కడికి వచ్చా. సిక్కిం రాష్ట్రంలో వ్యవసాయమంతా ఆర్గానిక్ పద్ధతిలో చేస్తాం. ప్రభుత్వం కూడా ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తోంది.

మిలాన్‌సుబ్బు, సిక్కిం రాష్ట్రం

సైకిల్ యాత్ర అంటే సరదా



సైకిల్‌యాత్ర అంటే నాకు సరదా. ఈ యాత్ర రికార్డు నెలకొల్పేందుకే చేస్తున్నాను. నేపాల్ దేశంలోని పర్నాలి రాష్ట్రంలోని సురకేత్ నుంచి 2024 సెప్టెంబరు 2న సైకిల్ యాత్ర మొదలుపెట్టా. ఇప్పటివరకు భారతదేశంలోని 12 రాష్ట్రాల్లో 6,400 కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నా. ఈరోజు హైదరాబాద్‌కు చేరుకొని విశ్రాంతి తీసుకుంటా.

డానియెల్, నేపాల్

సేవ్ ఎర్త్ నా నినాదం



బిహర్‌లోని సింహరి నుంచి 2024 జూన్ 13న సైకిల్ యాత్ర ప్రారంభించా. సేవ్ ఎర్త్, సేవ్ హెల్త్ అనే నినాదంతో సైకిల్‌యాత్ర ద్వారా ప్రచారం చేసేందుకు శ్రీకారం చుట్టా. ప్రకృతిని కాపాడుకోవాలి. 16 రాష్ట్రాల్లో 9వేల కిలోమీటర్లు ప్రయాణించి డిండి మీదుగా హైదరాబాద్‌కు వెళతున్నా.

సురజ్ సుమన్, బిహర్ రాష్ట్రం

సందడిగా మూసీ ఆయకట్టు



కేతేపల్లిలో యాసంగి వరి నాట్లు వేస్తున్న కూలీలు

(ఆంధ్రజ్యోతి-కేతేపల్లి)

నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో రైతులు యాసంగి సీజన్‌లో భారీగా వరి సాగు చేపట్టారు. గత వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసినా ఎగు వ నుంచి నిరంతరాయంగా వస్తున్న వరద నీటి తో పంటకాలం ముగిసే నాటికి ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయిలోనే ఉంది. ఈ నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలోని నకిరేకల్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో స్థిరీకరించిన 33వేల ఎకరాల భూముల్లో రైతులు యాసంగి వరి పంట సాగును చేపట్టారు. గత నెల 21న ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు అధికారికంగా సాగు నీటిని విడుదల చేయడంతో అప్పటికే వరి నారు పెంపకం చేపట్టిన రైతులు ప్రస్తుతం పొలం దుక్కి పను లు పూర్తిచేసి నాట్లు వేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు అక్రమంగా ఏర్పాటు చేసిన పంపుసెట్లతో నాన్‌ఆయకట్టులోని మరో 13వేల ఎకరాల మేర అనధికారికంగా పంటలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రధాన కాల్వలతో పాటు వాటి డిస్ట్రిబ్యూటరీ కాల్వలపైనా అక్రమంగా విద్యుత్ పంపు సెట్లు ఏర్పాటు చేసి కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి నీటిని తరలించి రైతులు కొన్నాళ్లుగా పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో మూసీ ఆయకట్టులో సక్రమ, అక్రమ ఆయకట్టు కలిపి దాదాపు 46వేల ఎకరాల మేర యాసంగి వరి పంట సాగవుతోంది. ఆయకట్టుకు తొలి విడత నీటి విడుదల గడువు మరో వారం రోజుల్లో పూర్తవుతుండడంతో రైతులు వరి నాట్ల పనులు పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు. దీంతో ఆయకట్టులో రైతులు, కూలీల సందడి నెలకొంది. మరోవైపు ఏఎమ్మార్పీ డీ-49కాల్వకు వారబందీ పద్ధతిన సాగునీరు విడుదలవుతుండడంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, బండపాలెం, కొండకిందిగూడెం, కేతేపల్లి, చెరుకుపల్లి, కొర్లపహాడ్ గ్రామాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ భూముల్లో వరి నాట్లు వేస్తున్నారు. వ్యవసాయ బావులు, బోర్ల నీటిపై ఆధారపడిన రైతులు ఇప్పటికే వరి నాట్లు ముందస్తుగా పూర్తి చేశారు.

అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతుల అవసరాన్ని ఎరువు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు యూరియాను అధికధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఒక్కో యూరియా బస్తా ఎమ్మార్పీ మేరకు రూ.266కు విక్రయించాల్సి ఉండగా మండల కేంద్రం కేతేపల్లిలో ఒక్కో బస్తాను రూ.300లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మారుమూల గ్రామాల్లోని వ్యాపారులు బస్తాకు రూ.50వరకు అదనంగా తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే బిల్లు మాత్రం రూ.266లకే ఇస్తున్నారు.

క్రమంగా పడిపోతున్న ప్రాజెక్టు నీటిమట్టం..

మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఇటీవల తగ్గుముఖం పట్టింది. దీనికి తోడు దాదాపు 20రోజులుగా ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు సాగునీరు విడుదలవుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా తగ్గుతూ వస్తుంది. ఆయకట్టుకు నీటిని విడుదల చేసిన గత నెల 21న ప్రాజెక్టు నీటిమట్టం 644.10అడుగులు(4.22టీఎంసీలు)గా ఉన్న నీటిమట్టం రెండున్నర అడుగుల మేర తగ్గి ప్రస్తుతం 641.58అడుగులు(3.59టీఎంసీ)లుగా నమోదయ్యింది. కాల్వలకు 440.32క్యూసెక్కులు విడుదల కాగా, ఆవిరి, సీపేజీ, లీకేజీలు, పంపుసెట్లు 31.24క్యూసెక్కులతో కలిపి మొత్తం అవుట్ ఫ్లో 471.56క్యూసెక్కులు కాగా ఇన్‌ఫ్లో 247.68క్యూసెక్కులుగా నమోదైంది.

ముమ్మరంగా వరి నాట్లు

కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో యాసంగి వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మూసీ కుడి ప్రధాన కాల్వ ఆయకట్టుతో పాటు ఏఎమ్మార్పీ డీ-49కాల్వ ఆయకట్టు, భూగర్భ జలమట్టం పెరగడంతో చెరువులు, బావులు, బోర్ల ఆయకట్టులో రైతాంగం ఈ యాసంగిలో భారీగా వరి సాగు చేస్తోంది. గత వానాకాల సీజన్‌లో మండలవ్యాప్తంగా 20,672ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇది ప్రస్తుత యాసంగి సీజన్‌లో మరింత పెరిగింది. మండలంలోని మూసీ ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు మండలంలోని చెరువులు, కుంటల ఆయకట్టులో దాదాపు 23వేల ఎకరాల వరకు వరి సాగవుతుంది.

ఆధునిక సాగు వైపు అడుగులు వేస్తున్న రైతులు

దశాబ్దాలుగా కొనసాగుతున్న సాంప్రదాయిక వరి సాగుతో ఏటేటా సాగు ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు ఆధునిక సాగు వైపు అడుగుల వేస్తున్నారు. వరిలో వెదజల్లడం, డ్రమ్‌సీడర్ వంటి ఆధునిక పద్ధతులు ఉన్నా ఇన్నాళ్లూ ఆ దిశగా రైతులు దృష్టి సారించలేదు. వరి నారు పెంచడం నుంచి నాటు వేసే వరకు ఎన్నో ఇబ్బందులు ఉండడం, నాటుకు కూలీలకొరత తీవ్రంగా ఉండడంతో వరి నాట్లు ఆలస్యమవుతున్నాయి. మరోవైపు నాటు కూలీ ఖర్చులు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రస్తుతం రైతులు వరి వెదజల్లడం, డ్రమ్‌సీడర్ వాడకంపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో కేతేపల్లి మండలవ్యాప్తంగా 100-150ఎకరాల్లో వెదజల్లడం, డ్రమ్‌సీడర్ సాగు చేసేవారు.ఈఏడాది యాసంగి సీజన్‌లో దాదాపు 450ఎకరాల్లో రైతులు వెదజల్లడం, డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగు చేశారు.

14వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి



ఆయకట్టు, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో కలిపి కేతేపల్లి మండలంలో 14వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. మరో 10 రోజుల్లో నాట్లు పూర్తవుతాయి. గతం కన్నా ఈ ఏడాది వరి విత్తనాలు వెదజల్లడం, డ్రమ్‌సీడర్ సాగు మూడింతలు పెరిగింది. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. వ్యాపారులు ఎవరైనా యూరియ బస్తా రూ.266ఎమ్మార్పీ ధరకే విక్రయించాల్సి ఉంది. అధిక ధరలకు విక్రయించినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- బి.పురుషోత్తం, ఏవో కేతేపల్లి

సాగర్ ప్రాజెక్టు ఆయకట్టులోనూ

మేళ్లచెర్వు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల వ్యాప్తంగా ముమ్మరంగా వరినాట్లు కొనసాగుతున్నాయి. 9,580 ఎకరాలలో వానాకాలంలో సాగు చేయగా, యాసంగి సీజన్‌లోనూ వరి పంటను సాగుచేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యత సమృద్ధిగా ఉండటం, వరిలో ఆశించిన దిగుబడి, గిట్టుబాటు ధర లభించటంతో రైతులు వరి సాగుపై మక్కువ చూపిస్తున్నారు. వర్షాకాలంలో పత్తి వేసిన రైతుల సైతం కొన్ని ప్రాంతాలలో పత్తి పంట అనంతరం వ్యర్థాలను తొలగించి, వరి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో వరినాట్లు మండల వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్నాయి. నాట్లుకు అనుబంధంగా వరి వెదజల్లడం పద్ధతి కొనసాగుతోంది. వరిలో నాటు కూలీల కొరత సమయభావంతో రైతులు విత్తనాలు వెదజల్లే ప్రక్రియ వైపు మొగ్గుచూపుతున్నారు. మేళ్లచెర్వు మండలంలో దాదాపు 600 ఎకరాల్లో వరి నాట్లకు స్వస్తి పలికి, వెదజల్లే ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియతో 20 రోజులకే నాట్లు పూర్తయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో మరో వారంలో నాట్లు చివరిదశకు చేరుకోనున్నాయి.



మేళ్లచెర్వులో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఆదివాసీల్లో చైతన్యం రావాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

నాగార్జునసాగర్,జనవరి8(ఆంధ్రజ్యోతి) : గిరిజనులు, ఆదివాసీలు ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని, వారిలో చైతన్యం రావాలని ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ప్రాజెక్టు హౌజ్‌లో ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశం నాలుగో రోజు బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనులు, ఆదివాసీలు తమ హక్కులను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గిరిజనులు తమ బిడ్డలను ఉన్నత విద్యా వంతులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థాయికి ఎదిగేలా చూడాలన్నారు.

గిరిజనుల జీవితాలు దుర్భరం: బెల్లయ్య నాయక్

తండాల్లో గికిజనుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయని ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. సాగర్‌లో నిర్వహిస్తున్న అఖిలభారత గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ తరగతుల్లో నాలుగో రోజు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా గ్రూపుకు 10 మంది చొప్పున 10 గ్రూపులుగా ఏర్పడి కృష్ణ పట్టి పరిధిలో తండాలను సందర్శించారు. తండాల్లో గిరిజనుల ఆవాసాలను, అక్కడ మౌలిక వసతులను, ఆహార విధానాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సక్రునాయక్, మునినాయక్, నాగేశ్వర్‌నాయక్, నరేందర్ నాయక్, స్వామి నాయక్, చందునాయక్ పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతి

● వైద్యుల నిర్లక్ష్యమేనంటూ కుటుంబీకుల నిరసన ● ఫర్నిచర్ ధ్వంసం


ఆసుపత్రి వద్ద రోదిస్తున్న రాహుల్

దేవరకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన నవజాత శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రిపై దాడి చేశారు. పోలీసులు, శిశువు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాకు చెందిన మూడావత్ రాహుల్‌కు గత ఏడాది లావణ్యతో వివాహమైంది. రాహుల్ హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాన్పు నిమిత్తం భార్య లావణ్యను మంగళవారం సాయంత్రం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యపరీక్షలు చేసిన అనంతరం సాధారణ ప్రసవం అవుతుందని, శస్త్రచికిత్స అవసరం లేదని వైద్యులు తెలిపారు. ఆమెకు నొప్పులు అధికం కావడంతో లావణ్య కుటుంబ సభ్యులు డాక్టర్లపై ఒత్తిడి తేవడంతో పాటు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది సిజేరియన్ ఆపరేషన్ చేయగా మగ శిశువు జన్మించాడు. శిశువు అనారోగ్యంగా ఉండటం, ఏడుపు రాకపోవడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. శిశువు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వాహనంలో బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శిశువు మృతి చెందాడు. మొదటి కాన్పులో మగశిశువు పుట్టి మృతి చెందడంతో తండ్రి రాహుల్‌తో పాటు కుటుంబసభ్యులు, బంధువులు శిశువు మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే నవజాత శిశువు మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆసుపత్రిలోకి వెళ్లి కంప్యూటర్‌తో పాటు ఆస్పత్రి అద్దాలను ధ్వంసం చేసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్‌ఐ రమేష్ హుటాహుటిన ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. శిశువు తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడి నచ్చచెప్పారు. శిశువు మృతికి డ్యూటీ డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని, ఆస్పత్రికి తీసుకురాగానే ఆపరేషన్ చేసి ఉంటే శిశువు బతికేదని శిశువు తండ్రి రాహుల్, తల్లి లావణ్యలు రోదిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్యుల తప్పేమీ లేదు: డాక్టర్ భానుప్రకాష్, వైద్యాధికారి

దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీకి వచ్చిన లావణ్యకు డాక్టర్లు, సిబ్బంది సకాలంలోనే వైద్యం అందజేశారు. మొదటికాన్పు కావడంతో నార్మల్ డెలివరీ అవుతుందని భావించారు. కానీ పురిటి నొప్పులు వస్తున్నాయని ఆపరేషన్ చేయాలని లావణ్య భర్త రాహుల్, కుటుంబసభ్యులు ఒత్తిడి చేయడంతోనే డ్యూటీ డాక్టర్ సిజేరియన్ ఆపరేషన్ చేయగా మగశిశువు జన్మించాడు. పుట్టిన శిశువు అనారోగ్యంగా ఉండటం, ఏడవక పోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. శిశువు అక్కడే మృతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు.

బోరు గుంతలో పడి మహిళా కూలీ మృతి

మిర్యాలగూడ అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బురద మడిలో ఉన్న బోరు గుంతలో తూలిపడి ఓ మహిళ ఊపిరాడక మృతి చెందింది. మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. రూరల్ ఎస్‌ఐ-2 వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన వెలిజాల యాదమ్మ(54) చిల్లాపురం రోడ్డు సమీపంలోని ముక్కా రామ్మూర్తి రైతు పొలంలో వరినాటు వేసేందుకు వెళ్లింది. బుధవారం మధ్యాహ్న భోజనం చేసేందుకు వెళ్లిన యాదమ్మ సమీపంలోని బోరు నీటి గుంత వద్దకు వెళ్లింది. నీళ్లు తాగుతున్న క్రమంలో యాదమ్మ గుంతలోకి తూలిపడి ఊపిరాడక మృతి చెందింది. సంఘటన జరిగిన ప్రదేశానికి దగ్గరలో ఉన్న చెట్టు వద్ద తోటి కూలీలంతా కూర్చుని భోజనం చేస్తుండడంతో ఆమెను గుర్తించలేకపోయారు. అనంతరం అపస్మారక స్థితిలో పడిఉన్న యాదమ్మను గుర్తించిన సహచర కూలీలు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతురాలి కుమారుడు వెలిజాల ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నత్తనడకన పాలేరు వంతెన గండి పనులు

● నాలుగు నెలలుగా కొనసాగుతున్న వైనం ● సంక్రాంతి వరకు పూర్తికాకపోతే వాహనాదారులకు అవస్థలే


రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దులో కొనసాగుతున్న గండి నిర్మాణ పనులు

కోదాడ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని జాతీయ రహదారిపై పాలేరు వంతెన గండి నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. గత సెప్టెంబరు మొదటివారంలో వచ్చిన వరదలతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దులోని పాలేరు వంతెన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు 40 అడుగులకు పైగా గండిపడింది. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఆ సమయంలో గండి ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హైవే అధికారులు నెలరోజుల్లో పూర్తి చేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని తెలిపారు. పనులను నాలుగు నెలలైనా పూర్తిచేయలేదు. ఇప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. వరదల సమయంలోనే వంతెనకు గండి పడినందున రాకపోకలను మూడు రోజులు పాటు నిలిపివేసి, మరో వంతెన మీదుగా రాకపోకలను కొనసాగించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి నిర్వహణ బాధ్యతలు నుంచి జీఎంఆర్ సంస్థ జూన్ 31వ తేదీ నుంచి తప్పుకుంది. దీంతో జాతీయ రహదారి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వరద తాకిడికి జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల్లోని అనేక సర్వీస్ రోడ్లు కొట్టుకుపోయాయి. వాటికి నేటికీ మరమ్మతులు చేయలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సర్వీసు రోడ్లపై ప్రయాణించే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దోరకుంట, చిమిర్యాల క్రాస్ రోడ్డు, నల్లబండగూడెం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు దెబ్బతిన్నాయి. అధికారులు ఎటువంటి మరమ్మతులు చేయించలేదు. జాతీయ రహదారిపై ఉన్న పాలేరు వంతెన ఆంధ్రా వైపు సుమారు 40 అడుగుల మేర గండిపడగా, మతెలంగాణ వైపు కూడా భవిష్యత్తులో గండిపడే అవకాశం ఉంది. పసిగట్టిన అధికారులు ఈ ప్రాంతంలో రూ.2.50కోట్లతో మరమ్మతు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ. 2.50కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పనులు దక్కించుకున్న సదరు కంపెనీ పనులను నత్తనడకన చేస్తున్నందున వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త వంతెనపై ఇరువైపులా వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నందున తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు తెలిపారు. ఇటీవల ఆంధ్రా వైపు జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకుతో ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టడంతో తండ్రీకుమారులు మృతి చెందారు. మరో ఘటనలో ఆటోను బస్సు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. మరో ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న భార్య, భర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నందున వాహనదారులు ఆందోళనలో ఉన్నారు. వంతెన పక్కన పడిన గండి పూడిక పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్రాంతి నాటికి పూర్తయ్యేనా?

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు ప్రధాన పండుగగా భావించే సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి సుమారు 20 నుంచి 30 లక్షల మంది వాహనాల్లో వెళ్లే అవకాశం ఉంది. అప్పటివరకు వంతెన నిర్మాణాలు పూర్తికాకపోతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని జాతీయ రహదారి అధికారులతో ఇటీవల జరిగిన సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. జాతీయ అధికారులు మాత్రం ఈ నెల 10వ తేదీ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

త్వరలో పూర్తి చేస్తాం

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ శివారులోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధి రామాపురం క్రాస్ రోడ్డు వద్ద పాలేరు వాగుపై ఉన్న వంతెనకు పడిన గండిని త్వరలో పూర్తి చేస్తాం. సంక్రాంతికి ఆంధ్రాకు పెద్ద సంఖ్యలో వాహనాలు తరలివెళ్లే అవకాశం ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించాం.

● నాగకృష్ణ, జాతీయ రహదారి మేనేజర్

వైకుంఠ ఏకాదశి వేడుకకు ఏర్పాట్లు

● రేపటి నుంచి అధ్యయనోత్సవాలు

భువనగిరి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముక్కోటి (ఈ నెల 10న) ఏకాదశి పర్వదినాన స్వామివారు ఉత్తర ద్వార దర్శనమిస్తారు. భక్తుల కోసం ఆలయ తిరుమాఢ వీధుల్లో ప్రత్యేక సదుపాయాలు, ఉత్తర ద్వారానికి ఇరువైపులా వేదికలను ఏర్పరిచారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, మీడియా ప్రతినిధులు, సాధారణ భక్తులకు వేర్వేరుగా ఈవో ఏ.భాస్కర్‌రావు పర్యవేక్షణలో సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి గ్యాలరీలు ఏర్పాటు చేశారు. స్వామివారు తెల్లవారుజామున 5.15 నుంచి 6.15గంటల వరకు స్వామివారు ఉత్తర ద్వార దర్శనమిస్తారు. ప్రకటించిన సమయం కంటే ముందుగానే భక్తులు వేడుకల్లో పాల్గొనేందుకు తరలిరావాలని ఈవో పిలుపునిచ్చారు.


ఉత్తర తిరుమాఢ వీధుల్లో వేదికలు, ప్రత్యేక గ్యాలరీల ఏర్పాటులో నిమగ్నమైన సిబ్బంది

ఆరు రోజుల పాటు అధ్యయనోత్సవాలు

స్వామివారి ఆలయంలో ఆరు రోజుల పాటు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం అలంకార సేవలు చేపట్టేందుకు ప్రధానార్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు బృందం అలంకార సేవలు, కైంకర్యాలకు సర్వం సిద్ధం చేశారు. కాగా, ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఆలయంలో నిర్వహించే లక్ష పుష్పార్చన, అర్జిత నిజాభిషేకం, సహస్రనామార్చనతో పాటు అధ్యయనోత్సవాల సందర్భంగా (శుక్రవారం నుంచి బుధవారం వరకు) ఆరు రోజుల పాటు ఆలయం లో నిత్యం నిర్వహించే సుదర్శన నారసింహ హోమం, శాశ్వత, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవాలు, వెండి జోడు సేవలు రద్దు పర్చడమే కాక ఈ నెల 13న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీరంగనాథుడు గోదాదేవి పరిణయం, 14న ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈవో ప్రకటించారు.

క్ర	తేదీ	సమయం	అలంకార సేవలు
1	10	ఉదయం:5.30 సాయంత్రం:6	వైకుంఠ నాథుడి అలంకరణ గరుఢ వాహన సేవ మత్స్యావతారం
2	11	ఉదయం:9 సాయంత్ర:6	వేణుగోపాల స్వామి (కృష్ణాలంకార సేవ) గోవర్ధనగిరి ధారి అలంకరణ
3.	12	ఉదయం:9 సాయంత్రం:6	శ్రీరామావతారం శ్రీవెంకటేశ్వరస్వామి అలంకరణ
4	13	ఉదయం:9 సాయంత్రం:6	వెన్న కృష్ణుడు అలంకరణ కాళీయమర్ధనుడు అలంకరణ
5	14	ఉదయం:9 సాయంత్రం:6	వటపత్రసాయి అలంకరణ వైకుంఠనాథుడి అలంకరణ (పరపద ఉత్సవం)
6	15	ఉదయం:9	లక్ష్మీ నరసింహ స్వామివారి అలంకరణ

15వ తేదీ ఉదయం, సాయంత్రం నిర్వహించే అలంకరణలతో అధ్యయనోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్ల అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండి జోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేద మంత్రాలు, మంగళవా యిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో ఎర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వా రా రూ.13,78,418 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి దివ్య విమాన రాజగోపురానికి బంగారు తాపడం కోసం చెన్నైకి చెందిన జీఆర్టీ జ్యూవెలరీస్ గ్రూప్ చైర్మన్ జీ.రాజేంద్రన్ ద్వారా సంస్థ ప్రతినిధులు 100గ్రాముల బంగారాన్ని ఈవో ఏ.భాస్కర్‌రావుకు అందజేశారు.


గర్భాలయ ముఖ మండపంలో ప్రతిష్టా మూర్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

కుట్ర పూరితంగా కేటీఆర్‌పై కేసులు

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీ కోటిరెడ్డి

నల్లగొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన కేసుల్లో పస లేదని ప్రభుత్వం కుట్ర పూరితంగా కేసులు పెట్టించిందని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కేసు పెట్టారన్నారు. హైకోర్టు కేసులు విచారణ చేసుకోవచ్చు అని పేర్కొంటే కాంగ్రెస్ పార్టీ మంత్రులు కేటీఆర్ దోషి అన్న విధంగా దుష్ప్రచారం చేస్తోందన్నారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని, ఇచ్చిన హామీలను అమలు చేయక కేసులు పెడుతున్నారన్నారు. రైతుభరోసా కింద రూ.15వేలు ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ రైతుల ఆగ్రహం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. కేటీఆర్‌పై ఈడీ, ఏసీబీ పోటీలు పడి మరి కేసులు పెడుతోందని కేటీఆర్ కేసులకు భయపడే వ్యక్తి కాదన్నారు. ఉద్యమ శిఖరమైన కేటీఆర్‌ను జైలు, కేసులు ఆపలేవని కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో నోట్ల కట్టలతో ఏసీబీకి అడ్డంగా దొరికిన దొంగ అని, అలాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమని అన్నారు. దేవుళ్లపై ఒట్టుపెట్టి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి రైతులను పట్టించుకోవడం లేదన్నారు. రైతుభరోసా, రుణమాఫీ అమలు చేయకపోవడంతో రైతులు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందని, కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, నాయకులు కేవీ.రామారావు, కోటేష్ యాదవ్, జమాల్ ఖాద్రీ, కట్ట శ్రీను, రంజిత్ కుమార్, అయితగోని యాదయ్య, నోముల క్రాంతి, మహేష్, బంగారు యాదవ్, సైదిరెడ్డి ఉన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ కేసులకు ఎందుకు భయపడుతున్నారు?


సమావేశంలో మాట్లాడుతున్న గుత్తా అమిత్ రెడ్డి

నల్లగొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫార్ములా ఈ- రేస్‌లో తప్పు చేయకపోతే కేసులకు ఎందుకు భయపడుతున్నారని రాష్ట్ర పాడి పరిశ్రామిభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పా టు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్‌కు నిద్రలో కూడా ఫార్ములా-ఈ రేస్‌పై కలవర పడుతున్నారని చట్టం దృష్టిలో అందరూ సమానమే అయినందున కేటీఆర్ పైనా విచారణ జరుగుతుందన్నారు. కేటీఆర్‌కు ఈ- రేసు ముఖ్యమైతే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతన్నలు ఆదుకోవడం ముఖ్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బడ్జెట్‌లో అదనంగా 30శాతం నిధులను పెంచి దాదాపు రూ.63వేల కోట్లను రైతుల కోసం ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. డిండి ప్రాజెక్టు కోసం రూ.1800కోట్లు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ నాయకురాలు ఎంపీ ప్రియాంకపై బీజేపీ నేత చేసిన అనుచిత వ్యాఖ్యలు బాధాకరమని, తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విజయ డెయిరీకి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రూ.100 కోట్లు కేటాయించడం జరిగిందని, ఇందులో రూ.50 కోట్లను రైతుల బకాయిలకు చెల్లించడం జరిగిందన్నారు. సమావేశంలో నాయకులు అయితగాని స్వామిగౌడ్, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, దుబ్బ అశోక్ సుందర్, మునాసా వెంకన్న, మందడి మధుసూదన్ రెడ్డి, కంచరకుంట్ల గోపాల్ రెడ్డి, రామదాసు హరికృష్ణ, చిలకరాజు శ్రీనివాస్, వలిశెట్టి మల్లయ్య, రేగట్టె సైదులు పాల్గొన్నారు.

సంక్రాంతికి బస్సులే బస్సులు

(5వపేజీ తరువాయి)

లగ్జరీ, డీలక్స్ బస్సులు ఉండనున్నాయి. పండుగ సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సుల ద్వారా స్వల్పంగా అదనపు చార్జీలు వసూలు చేసే యోచనలో సంస్థ ఉన్నట్లు సమాచారం.

రీజియన్ పరిధిలో ఏడు డిపోల నుంచి

నల్లగొండ రీజియన్ పరిధిలో దేవరకొండ, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట, నార్కట్‌పల్లి, యాదగిరిగుట్ట నల్లగొండ మొత్తం ఏడు డిపోల నుంచి 400 బస్సు సర్వీసులు నడపనున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీని మేరకు వీటిని నడుపుతారు. ఈ నెల 9న 38 బస్సులు, 10న 110 బస్సులు, 11న 130 బస్సులు, 12న 90 బస్సులు, 13న 32 బస్సులు ప్రత్యేక సర్వీసుగా నడపనున్నారు. తిరిగి 15 నుంచి 20వ తేదీ వరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచుతారు. హైదరాబాద్ నుంచి నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, యాదగిరిగుట్టలకు అదనపు బస్సులు నడిపే యోచనలో ఉన్నారు. ప్రస్తుతం రీజియన్‌లో 640 బస్సులు ఉన్నాయి. స్పేర్ బస్సులు కూడా మరో 40 ఉన్నాయి. ప్రతిరోజు 2.50లక్షల కి.మీలు తిరిగి ఆయా ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. రోజువారీగా సంస్థకు రూ.1.40కోట్ల మేర ఆదాయం వస్తోంది.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి



సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నాం. పండుగ రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో వీటిని నడిపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ఎక్కడా ప్రయాణీకులు ఇబ్బంది పడకుండా క్షేమంగా సొంత ఊళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశాం. ప్రయాణీకులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలి. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక బస్సు సర్వీసుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం.

కె.జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం

ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం


భూదాన్‌పోచంపల్లి, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిమండలం జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ) లో పలు ట్రేడుల్లో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ కిషోర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పిస్తున్న పేర్కొన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన- డీడీయూజీకేవై ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్ష కార్యక్రమాలకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సుకు ఇంటర్మీడియట్ పాసైన వారు అర్హులని తెలిపారు. మూడున్నర నెలల కాలపరిమితి గల అకౌంటెంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్ పాసైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆటోమొబైల్ - 2వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి పాస్ అయిన వారు అర్హులని, ఆటోమొబైల్-2 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి పాసై ఉండాలన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేరు కోర్సుకు పదవ తరగతి కనీస విద్యార్హత అని అన్నారు. 5 నెలల కాలపరిమితి గల ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్) కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ ఉన్న వారికి ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. 4 నెలల కాలపరిమితితో సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఐటీఐ ఉన్న వారికి ప్రాధాన్యత కల్పించనున్నట్లు వివరించారు. వివరాలకు 91339 08000, 9133 908111, 91339 08222/ 9948466111నంబర్‌నుసంప్రదించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకత కోసం

(5వపేజీ తరువాయి)

అవకతవకలకు అడ్డుకట్టపడుతుందని అధికారులు భావిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని ఏడు నెలల వయసు నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు, కేంద్రాలకు రాలేని శారీరక పరిస్థితులు ఉన్న గర్భిణులు, బాలింతలకు ప్రతీ 25 రోజులకు ఒకసారి కోడిగుడ్లు, బాలామృతం, ఇతర ఆహార పదార్థాలు ఇంటికి ఇస్తారు. మిగతా లబ్ధిదారులందరూ పని రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి అన్నంతో పాటు గుడ్లు ఇతర ఆహార పదార్థాలను తినాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే అందరి లబ్ధిదారుల ఆధార్ నెంబర్, ఫొటోలు, ఇతర వివరాలను పోషణ అభియాన్ ట్రాకర్‌లో ఫీడ్ చేశారు. తాజాగా, అమలు చేస్తున్న ఈ-కేవైసీలో టీహెచ్ఆర్ లబ్ధిదారుల ఫొటోలను అంగన్‌వాడీ టీచర్లు క్యాప్చర్ చేసిన వెంటనే లబ్ధిదారుడి సెల్ ఫోన్‌కు ఓటీపీ వెళ్తుంది. ఓటీపీని ధ్రువీకరించగానే ఈ-కేవైసీ నమోదు పూర్తవుతుంది. త్వరలోనే ఈ-కేవైసీ నమోదైన వారికి టీహెచ్ఆర్ ఇవ్వనున్నారు. ఈ విధానంతో టీహెచ్ఆర్ పంపిణీ పారదర్శకంగా, జవాబుదారీతనంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఈ-కేవైసీ నమోదు ప్రారంభించాం



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ-కేవైసీ నమోదు ప్రారంభమైంది. ఇప్పటికే ఎంపిక చేసిన సూపర్‌వైజర్లు, టీచర్లకు నమోదుపై అవగాహన కల్పించాం. త్వరలోనే టీచర్లందరికీ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తాం. ఈ-కేవైసీతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పారదర్శకంగా ఉంటుంది. లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందుతుంది.

-నర్సింహారావు,
యాదాద్రి జిల్లా సంక్షేమ అధికారి

నల్లగొండ

నకిరేకల్ - మునుగోడు

నర్సరీల సందర్శన

నార్కట్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపహాడ్, అక్కెనపల్లి, నెమ్మాని, అవురవాణి, చౌడంపల్లి, కొండపాక గూడెం గ్రామాలను ఎంపీడీవో ఉమేశ్‌చారి బుధవారం సందర్శించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొన్ని చోట్ల రోడ్లపై మురుగునీరు ప్రవహించడం చూసి పంచాయతీ కార్యదర్శులను మందలించారు. ఎంపీడీవో వెంట ఏపీవో యాదయ్య, ఈసీ రాంబాబు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ప్రవేశానికి 6వ తరగతి చదవడానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివస్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7,8,9,10వ తరగతిలో మిగిలిన సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 13వ తేదీ నుంచి తరగతులను బట్టి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

బీజేపీ కార్యాలయంపై దాడికి క్షమాపణ చెప్పాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ బుధవారం పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో, మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తపల్లి స్టేజీ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ క్షమాపణలు చెప్పకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, బీజేపీ ఎదురు దాడికి దిగితే తట్టుకోలేరని హెచ్చరించారు. కొత్తపల్లి వద్ద జరిగిన ధర్నాలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గూండాలు ఒక పథకం ప్రకారం దాడి చేశారని ఆరోపించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై భౌతికంగా దాడి చేసి గాయపరచడం హేయమని అన్నారు. దాడికి పాల్పడిన గూండాలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, జిల్లా నాయకులు గాయం భూపాల్‌రెడ్డి, లకడాపురం వెంకన్న, రావేల కాశమ్మ, బద్ధం నగేష్, మండ ల అధ్యక్షుడు బొగరి అనిల్‌కుమార్, నాయకులు ప్రమోద్, వెంకట్‌రెడ్డి, నరసింహ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని, క్రమశిక్షణ పక్కకు పెడితే కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరగలేరన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావు లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాస శ్రీనివాస్, కూరెల్ల శ్రీను, పొట్లపల్లి నర్సింహ, కన్నెబోయిన మహాలింగం, ఈడ్దుల మల్లేష్‌కుమార్, పాల రవివర్మ, పీకే వెంకన్న, రవి, పాల శివ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన చేస్తున్న కాంగ్రెస్

చిట్యాల: రాష్ట్రంలో ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి వ్యతిరేకంగా బుధవారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ నాయకులకు కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ

● మునుగోడులోని బీఆర్. అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఇరుగు రవి వెంటనే అక్కడకు చేరుకొని వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఆందోళన కొనసాగిస్తున్న నేతలను అదుపులోకి తీసుకొని అనంతరం వదిలేశారు.

నేడు ఎన్జీ కళాశాలలో జాబ్‌మేళా

నల్లగొండటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): టాస్క్ ద్వారా పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన స్థానిక నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్, టీఎస్‌కేసీ సమన్వయకర్త డాక్టర్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025లో బీఎస్సీ బీఏ, బీకాం, బీబీఏ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెజూమ్, ఆధార్ లేదా పాన్‌కార్డుతో ఉదయం 9.30గంటలలోపు హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

మునుగోడురూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వలపల్లి గ్రామంలో గ్రామంలో ఇళ్ల మీదుగా ఉన్న 11 కేవీ లైన్‌లను మార్చాలని సీపీఎం గ్రామ కార్యదర్శి వంటి పాక అయోధ్య డిమాండ్ చేశారు. బుధవారం గ్రామశాఖ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివర్ల వీరమళ్లు, అమరేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు

చిట్యాలరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం ఉరుమడ్లలో అభివృద్ధి పనులకు రూ. 6.5 కోట్ల నిధులను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంజూరు చేయించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఉరుమడ్ల గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోనేటి యాదగిరి, చెరుకు సైదులు, పోలగోని స్వామి, పల్లపు బుద్ధుడు, పట్ల జనార్ధన్, జనపాల శ్రీను, ఉయ్యాల నరేష్, పాకాల దినేష్, శ్రీను, కురుపటి లింగయ్య, గుత్తా రవీందర్‌రెరెడ్డి, ఐతరాజు నర్సింహ, వెంకన్న, చంద్రయ్య, శంకర్, ఎల్లయ్య, మహేష్, వెంకన్న, లింగయ్య, మధు, రామకృష్ణ, యాదయ్య, నర్సింహ, జానయ్య, లక్ష్మయ్య, రాములు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న మోదీ రాందేవ్

నార్కట్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్థానిక ప్రైవేటు పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవా రం ఎంఈవో నర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షకు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు రూ.125లు ఉంటే రూ.2500లు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విషయం తెలిసి సదరు పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే మేం వసూలు చేసే ఫీజుల్లో ఎంఈవో నుంచి మొదలుకుని డీఈవో కార్యాలయం వరకు ముడుపులు చెల్లించాల్సి ఉంటుందని బహిరంగంగా చెబుతున్నారని పేర్కొన్నారు. అర్హత లేని వారితో పాఠాలు బోధిస్తున్నారని, అధిక ఫీజుల వసూలు, పరిమితికి మించి బస్సుల్లో విద్యార్థుల చేరవేత, డొనేషన్ ఫీజులు, వసూలు చేస్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని ఎంఈవో హామీ ఇచ్చారని రాందేవ్ తెలిపారు. బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, భాస్కర్, మల్లారెడ్డి, సుధీర్, రామన్నగౌడ్ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

కట్టంగూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలు ఉన్న ప్రతీ డ్రైవర్ తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎస్‌ఐ రవీందర్ అన్నారు. జాతీయ రహదారిపై వాహనాలు నడిపే డ్రైవర్ల కోసం కట్టంగూరు గ్రామశివారులో న్యూ ఓడిశా దాబా వద్ద ఏర్పాటు చేసిన కంటి పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా అందజేసే అద్దాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య, ఎంవీఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో విద్యార్థులు రాణించాలి

కట్టంగూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు అన్నారు. మండలంలోని చెర్వుఅన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం పాదూరి రాంమోహన్‌రెడ్డి, కోటిలింగం, లింగయ్య, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక యాత్రకు వెళ్లిన విద్యార్థులు

మర్రిగూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక యాత్రలో భాగంగా దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంనాయక్ మాట్లాడుతూ ఫిల్మ్‌సిటీలో ఉన్నటువంటి అద్భుత కళాఖండాలను పిల్లలను ఆకట్టుకునే విధంగా ఉన్నాయని, విద్య వైజ్ఞానిక జ్ఞానం వస్తుందని తెలిపారు. వారివెంట ఉపాధ్యాయులు మంజులత, శ్రీనివాస్, మీనా, అమీనా తదితరులు పాల్గొన్నారు.

సపావత్‌తండాలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

తిరుమలగిరి(సాగర్), జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని సపావత్‌తండాలో గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఎస్‌పీఎల్-3 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ సపావత్ జామ్లా బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25,116లు, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ బహుమతి రూ.10,116లు అందిం చనున్నట్లు పేర్కొన్నా రు. వివరాలకు 88857848838, 7780746174 నెంబర్లను సంప్రదించాలన్నారు.

● మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలో టీఎంపీ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ జర్పుల నాగేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9603483708 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గొడ్డు కారం ఘటనపై విచారణ జరిపించాలి

● *ఎంజీయూ వీసీకి బీఆర్‌ఎస్వీ వినతి*



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున

నల్లగొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీలోని బాలికల వసతిగృహంలో నెలకొన్న గొడ్డుకారంతో అనే సంఘటనపై విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్య తీసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. బీఆర్‌ఎస్వీ విద్యార్థులకు అండగా ఉంటుందని ఏ సమస్య వచ్చిన వీసీతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి చల్లా కోటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోముల క్రాంతి, తేనాలి సైదిరెడ్డి, కత్తుల బంగారు, శంకర్, యుగందర్, సైదులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి

● *సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి*



దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో నిర్మించిన 552 డబుల్ బెడ్ రూం ఇళ్లత వద్ద మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డి మాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 3వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్లను ఎనిమిదేళ్ల కాలంలో లబ్ధిదారులకు అందజేయకుండా కాలయాపన చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వమైనా నిర్మించిన ఇళ్లల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేసి జనవరి 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు డీవైఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండి సలీం, తుమ్మల పద్మ, నర్సింహ, అశోక్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి



హాకీ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన అండర్ -19 ఎస్‌జీఎఫ్ బాలుర రాష్ట్రస్థాయి బాలుర హాకీ ఎంపిక పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఈవో బొల్లారం భిక్షపతి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌తో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆసక్తి కలిగిన ఆటల్లో మెళకువలు నేర్చుకొని జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో విజయం సాధించాలని సూచించారు. జాతీయస్థాయి క్రీడ అయి న హాకీకి మంచి ఆదరణ ఉందని, జిల్లాలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని హాకీ క్రీడలో రాణించాలని కోరారు. అనంతరం జరిగిన ఎంపిక పోటీల్లో వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జట్ల మధ్య పోటీలు జరిగాయి. నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లా జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. కార్యక్రమంలో డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి ఇందిర, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, హాకీ అసోసియేషన్ కార్యదర్శి కరీం, పీఈటీ రవీందర్, మెర్సీ ప్రభావతి, శ్రీను, కరుణాకర్‌రెడ్డి, ధర్మేందర్, సురేందర్, చంద్ పాల్గొన్నారు.

వృత్తిలో మెళకువలు నేర్చుకోవాలి

● *నీటి పారుదలశాఖ సీఈ అజయ్‌కుమార్*



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్

నల్లగొండ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు వృత్తిలో మెళకువలు నేర్చుకొని, శాఖకు పేరు తీసుకురావాలని నీటి పారుదలశాఖ సీఈ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా నీటిపారుదలశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఇటీవల నూతనంగా నియమితులైన ఏఈఈలకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు విధులపై సరైన అవగాహన పెంచుకోవాలన్నారు. సీనియర్ల సలహాలు తీసుకొని శాఖకు పేరు తీసుకొచ్చేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టుల్లో కీలకంగా పనిచేయాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ విభాగం చీఫ్ ఇంజనీర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ, ఇంజనీర్లు సాంకేతికతను అందిపుచ్చుకొని విధులను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎన్నెస్పీ ఎస్‌ఈ శ్రీధర్‌రావు, మాల్ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఇంజనీర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు రవీందర్, ఫైనాన్స్ జనరల్ సెక్రటరీ నల్లగొండ ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్, యాదన్న కుమార్, రేఖల ప్రభాకర్, శ్రీనివాస్, చక్రపాణి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్, శివరాజ్, చంద్రకాంత్, వాజిద్, మజీద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



ఓగోడు పీహెచ్‌సీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నకిరేకల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ మండలం ఓగోడు పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన అవగా హన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణుల నమోదు, వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిక వ్యాధులు, క్షయ, కుష్ఠు వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజల కు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో ఓగోడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యోగస్వీ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మాదారం స్కూల్‌లో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న ఎస్‌ఐ సైదులు

శాలిగౌరారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌ఐ డి.సైదులు అన్నారు. మండలంలోని మాదారం ప్రాథమిక పాఠశాలలో శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సీనియర్ లీడర్ రేపాల మదన్‌మోహన్ సహకారంతో విద్యార్థులకు ఎస్‌ఐ సైదులు స్పోర్ట్స్ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదులు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు, మొబైల్, టీవీ సీరియళ్లకు బానిస కావద్దని సూచించారు. మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పున్న శ్రీనివాస్, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, సభ్యులు గుండ్ల రామ్మూర్తి, దామెర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు రామ్మూర్తి, పీఈటీ మయూబ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కనగల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈవో, ప్రముఖ విద్యావేత్త ఎంవీ గోనారెడ్డి కోరారు. మండలంలోని చినమాదారం పాఠశాల విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం టై, బెల్టులను అందజేశారు. అనంతరం పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా గోనారెడ్డి మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు మంచి గ్రేడ్‌ను సాధించాలని ఆయన సూచించారు. ఎంఈవో పద్మ, ఉపాధ్యాయులు పల్‌రెడ్డి రాంరెడ్డి, దేప నరేందర్‌రెడ్డి, హుస్సేన్, రమేష్‌రెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

చిట్యాలరూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపూర్, గుండ్రాంపల్లి, బోయగుబ్బలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎ.వెంకట్‌రెడ్డి విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే తమ లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని అన్నారు. తాము అభ్యసించే తరగతుల్లో సత్ఫలితాలను సాధించి కుటుంబానికి పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలన్నారు. ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ ఫౌండేషన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసిందని, విద్యార్థుల విద్యాభివృద్ధికి తగిన సహకారాన్నందించి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అనుముల శ్రీనివాస్, కూరెళ్ల నర్సింహాచారి, గరిషె అంజయ్య, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెల్లంకి రమణాచారి, వి.కృష్ణ, శ్రీనివాస్, అనురాధ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నేరడ ఆలయంలో వైభవంగా దీపోత్సవం



నేరడలో దేవతామూర్తుల ఎదుట పాశురాన్ని పారాయణం చేస్తున్న భక్తులు


చిట్యాలరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడలో శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో 44వ మార్గళి ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా బుధవారం 24వ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవాలయంలో తిరుప్పావై ద్రావిడ ప్రబంధ 24వ పాశురాన్ని పారాయణం గావించి మంగళనీరాజనాలు సమర్పించారు. 44వ మార్గళి ధనుర్మాసోత్సవాల పూజల సందర్భంగా భక్తులు దేవాలయంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుప్పావై 24వ పాశురాన్ని పారాయణం చేసి పూజలో పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులతో ఆలయానికి చేరుకుని దేవతామూర్తుల ఎదుట తిరునామాలతో దీపోత్సవాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రియాంకగాంధీకి క్షమాపణలు చెప్పాలి

కేతేపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ మాజీ ఎంపీ రమేష్‌బిదూరి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.యూసుఫ్‌జాని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రియాంకపై బిదూరి చేసిన వ్యాఖ్యలతో మహిళలపై బీజేపీకి ఏమాత్రం గౌరవం ఉందో తేటతెల్లమైందని అన్నారు. బీజేపీ నేతలు మహిళలను కించపరచడంలో ఎప్పుడూ ముందుంటారని విమర్శించారు. బీజేపీ నాయకులు ఇప్పటికైనా తమ భాషను, యాసను మార్చుకోకపోతే మహిళలు చీపుర్లతో కొడతారని ఆయన హెచ్చరించారు.

రమేష్ బిదూరిని బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలి

నకిరేకల్: ప్రియాంకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకుడు రమేష్ బిదూరిని బీజేపీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు కొమ్మనబోయిన సైదులు మాట్లాడుతూ ఎంపీ ప్రియాంకగాంధీపై బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మహిళలను ఎంత అగౌరవపరిచారో దేశ ప్రజలు గమనిస్తున్నారని, బీజేపీకి మహిళలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్, ఉగ్గిడి శ్రీనివాస్, గణేష్, సింహాద్రి, సంజయ్, జాని, అజయ్, తరుణ్, అరవింద్, కోటి పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 17.4

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నైజేషన్ (ముఖ కవళికల గుర్తింపు) ద్వారా లబ్ధిదారుల గుర్తింపునకు దశలవారీగా అడుగులుపడుతున్నాయి. ఇప్పటికే పోషణ్ అభియాన్ ట్రాకర్ అమలవుతుండగా, ఇందులో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతల ఫొటో తీయడం చేస్తున్నారు. అయితే టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్) తీసుకెళ్తున్న వారికి మాత్రం ఈ విధానం లేదు. ఈ నేపథ్యంలో టీహెచ్ఆర్ లబ్ధిదారులకు ఫేస్ రికగ్నైజేషన్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనంతరం దశలవారీగా అందరికీ దీన్ని వర్తింపజేయనున్నారు.

- (ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్)



అంగన్‌వాడీ కేంద్రాల్లో
పారదర్శకత కోసం

- లబ్ధిదారులకు ఫేస్ రికగ్నైజేషన్
- మొదటగా టీహెచ్ఆర్ లబ్ధిదారులకు
- దశల వారీగా అందరికీ
- ఉమ్మడి జిల్లాలో 4,203 అంగన్‌వాడీ కేంద్రాలు



గర్భిణులు, బాలింతలు, పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం పంపిణీతో పాటు ప్రీస్కూల్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. లబ్ధిదారులందరికీ మెనూ ప్రకారం ప్రతి రోజూ ఇక్కడ ఆహార పదార్థాలు అందిస్తారు. పిల్లలకు అక్షరాభ్యాసంతో పాటు ఆటపాటలతో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, మూడేళ్ల పైబడిన పిల్లలు ప్రతీ రోజు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుండగా, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్) విధానంలో అంగన్‌వాడీ టీచర్లు ఆహార పదార్థాలు ఇంటికి ఇస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యంతో పాటు అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం నుంచి ప్రతీ రోజూ ఆయా కేంద్రాలకు హాజరైన పిల్లలు, ఆహార పదార్థాలను తినేందుకు వచ్చే బాలింతలు, గర్భిణుల ఫొటోలను సెల్ ఫోన్ ద్వారా పోషన్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో క్యాప్చర్ చేస్తున్నారు.అయితే టీహెచ్ఆర్ లబ్ధిదారులకుమాత్రం క్యాప్చర్ విధానం లేదు. అంతేగాక పిల్లల్లో శారీరక ఎదుగుదల లోపిస్తున్నట్టు ఇటీవలి రికార్డులు, సర్వేలు పేర్కొనడంతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని అమల్లో కి తెచ్చింది. ఈమేరకు తొలి దశలో టీహెచ్ఆర్ లబ్ధిదారుల జాబితాకు వారి ఫొటోలను ఎ లక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ-కేవైసీ) విధానంలో జత చేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ఈ-కేవైసీ నమోదు ప్రారంభమైంది.

ఈ-కేవైసీతో...

పోషన్ అభియాన్ ట్రాకర్‌లో అదనపు ఆప్షన్‌గా ప్రవేశపెట్టిన ఈ-కేవైసీతో లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అంది వారి ఆరోగ్యానికి దోహదపడడంతో పాటు ...

- మిగతా 7వ పేజీలో...



ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు ఇలా..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	0-3ఏళ్ల పిల్లలు	3-6ఏళ్ల పిల్లలు
నల్లగొండ	2,093	8,543	8,391	51,970	30,447
యాదాద్రి	901	4,046	4,356	26,102	19,446
సూర్యాపేట	1,209	5,459	4,741	30,372	19,525
మొత్తం	4,203	18,048	17,488	1,08,444	69,418


పోషన్ అభియాన్ ట్రాకర్ ప్రారంభంలోనే అంగన్‌వాడీ టీచర్లందరికీ ప్రభుత్వం స్మార్ట్ ఫోన్, ప్రత్యేక సిమ్ కార్డు అందజేసింది. అంగన్‌వాడీ కేంద్రం సమగ్ర వివరాలను సెల్ ఫోన్‌లోనే నమోదు చేస్తున్నారు.

అవగాహనా లోపం

గతంలో అంగన్‌వాడీ టీచర్లు 14 రికార్డులను రాయాల్సి ఉండేది. ఇప్పుడు ఆఫ్‌లైన్ పని గణనీయంగా తగ్గి ఆన్‌లైన్ నమోదు పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ-కేవైసీని అమలులోకి తేవడంతో టీహెచ్ఆర్ లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్‌ను అంగన్‌వాడీ టీచర్లు ప్రారంభించారు. కానీ, వారికి సూచనలు, సలహాలు మినహా శిక్షణ, అవగాహన కల్పించకపోవడంతో ఈ-కేవైసీ నమోదు ఇబ్బందికరంగా మారుతోంది. అలాగే పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య కూడా ఎదురవుతోంది. కానీ, ఈ-కేవైసీ డాటాపై పర్యవేక్షణ పేరుతో అధికారులు చేస్తున్న ఒత్తిడితో అంగన్‌టీచర్లు సతమతమవుతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా ఈ-కేవైసీ నమోదుపై శిక్షణ ఇవ్వాలని టీచర్లు కోరుతున్నారు.

రూ.622.91కోట్ల విలువైన
ధాన్యం కొనుగోళ్లు

- ప్రభుత్వ కేంద్రాల ద్వారా 2.68లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- అందులో 68,200 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం
- 95శాతం చెల్లింపులు పూర్తి
- రూ.27.19కోట్ల బోనస్ చెల్లింపు
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటేశ్వర్లు



ఇంటర్వ్యూ
Interview

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2,68,496 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.. మొత్తం రూ.622.91కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, ఇప్పటివరకు 95శాతం మేర అంటే రూ.587.81కోట్ల చెల్లింపులు చేశాం.. సన్నధాన్యం కొనుగోళ్లకు రూ.27.19కోట్ల బోనస్ రైతులకు చెల్లించామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ విశేషాలు ఇలా..

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఈ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం ఎంత?

వెంకటేశ్వర్లు: జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2,00,296 మెట్రిక్‌టన్నుల దొడ్డురకం ధాన్యం, 68,200 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కలిపి మొత్తం 2,68,496 మెట్రిక్ టన్నులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశాం.

ఆం: సన్నధాన్యం కొనుగోళ్లు ఎలా సాగాయి?

వెంకటేశ్వర్లు: జిల్లాలో సన్నధాన్యం కొనుగోళ్లకు 88 కేంద్రాలు ఏర్పాటు చేశాం. మొత్తం 68,200 మెట్రిక్ టన్నుల సన్నాలను ఈ కేంద్రాల ద్వారా సేకరించాం. అయితే మిల్‌పాయింట్ల వద్ద మరో 6లక్షల మెట్రిక్‌టన్నుల పైచిలుకు ధాన్యాన్ని రైతులు నేరుగా విక్రయించారు. మిల్లుల వద్ద రైతులు నష్టపోకుండా, ఇబ్బంది కలగకుండా గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నాం.

ఆం: ధాన్యం చెల్లింపులు పూర్తిస్థాయిలో పూర్తయినట్టేనా?

వెంకటేశ్వర్లు: ఈ సీజన్‌లో 51,347 మంది రైతుల నుంచి మొత్తం రూ.622.91కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాం. 95శాతం మేర చెల్లింపులు ఇప్పటికే పూర్తయ్యాయి. 48,148 మంది రైతులకు సంబంధించి రూ.587.81కోట్ల చెల్లింపులు పూర్తిచేశాం. ఇంకా కేవలం 5 శాతం మేర చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి కూడా ప్రాసెస్‌లో ఉన్నాయి. వారం రోజుల్లో దాదాపు నూరు శాతం చెల్లింపులు పూర్తవుతాయి.

ఆం: సన్నరకాలకు బోనస్ పరిస్థితి ఏంటీ?

వెంకటేశ్వర్లు: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని విక్రయిస్తే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో సన్న ధాన్యం విక్రయించిన రైతులకు మొత్తం రూ.34.10కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికే రూ.27.19 కోట్లు రైతుల ఖాతాల్లో జమైంది. మిగిలిన బోనస్ కూడా రైతులకు త్వరలో అందుతుంది.

అతనెవరు?

- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం
- 'అతని పేరు చెబితే హడల్' కథనంపై అధికార, ఉద్యోగవర్గాల్లో ఆసక్తి
- ఇంటెలిజెన్స్ సైతం ఆరా



నల్లగొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సమాచారహక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ ఉద్యోగులను భయపెడుతూ వసూళ్లకు పాల్పడే ఉదంతాన్ని ఉన్నది ఉన్నట్లుగా ప్రచురించారని పలువురు అధికారులు, ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌చేసి ప్రశంసించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'అతని పేరు చెబితే హడల్' కథనం జిల్లా అధికారులు, ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. అవకవతవకలు, అవినీతికి పాల్పడ్డా, ప్రజాధనం దుర్వినియోగం చేసినా నిరభ్యంతరంగా తప్పును ఎత్తిచూపవచ్చని, చర్యలు కోరవచ్చని, అయితే ఈ సాకుతో వేధింపులకు పాల్పడితే ఎలా సహిస్తామని వ్యవసాయశాఖాధికారులు వాపోతున్నారు. వ్యవసాయశాఖలో పని చేసే ఉద్యోగులు, అధికారులే కాకుండా ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు సైతం ఈ కథనంపై ఆరా తీశారు. మరోవైపు ఈ కథనంలో పేర్కొన్న అంశాలు, బెదిరింపులపైనా పోలీస్ ఇంటెలిజెన్స్‌వర్గాలు ఆరా తీశాయి. అందులో భాగంగా ఉద్యోగులు, అధికారుల ద్వారా వివరాలు సేకరించారని, ఒకటి, రెండు రోజుల్లో నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు తెలిసింది.

సంక్రాంతికి బస్సులే బస్సులు

- రీజియన్‌లో 400 అదనపు బస్సులు నడపనున్న ఆర్టీసీ
- నేటి నుంచి 13 వరకు, తిరిగి 15 నుంచి 20వ తేదీ వరకు
- ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోల నుంచి బస్సులు



సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

పండుగకు పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చే ప్రయాణికులు అధికంగా ఉంటారు. వారిని దృష్టిలో పెట్టుకొని పండుగ ముందు రోజుల్లో హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాలకు వచ్చే బస్సుల సంఖ్యను పెంచారు. ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోల నుంచి ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్.బీనగర్, ఉప్పల్, ఐఎస్‌సదన్, సాగర్ రింగురోడ్డు ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ క్యాంపులు ఏర్పాటు చేసి అక్కడి నుంచి బస్సులను ఆపరేట్ చేయనున్నారు. రీజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది వీటిని పర్యవేక్షించనున్నారు. ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు, ఆ తరువాత తిరిగి 15 నుంచి 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 400 ప్రత్యేక బస్సులు నడిపేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర రాజధాని, సరిహద్దు జిల్లాలకు ఈ బస్సులు నడవనున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సుల సంఖ్యను ఆర్టీసీ అధికారులు పెంచారు. దసరా పండుగ సందర్భంలో మాత్రమే ప్రత్యేక బస్సులు నడిపే ఆర్టీసీ ఈసారి సంక్రాంతి పండుగకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక బస్సులను పెద్ద సంఖ్యలో నడిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రయాణికులకు సౌకర్యంతోపాటు ఆర్టీసీకి అధిక లాభాలు సమకూర్చేందుకు ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నాయి. రాష్ట్ర రాజధానితో పాటు ప్రధాన పట్టణాలు, జిల్లా కేంద్రాలు, మండలాలు, గ్రామాలకు పండుగ సందర్భంగా ప్రయాణికులు సొంత ఊళ్లకు వెళ్లేందుకు ఈ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. మరోవైపు విద్యా సంస్థలకు సెలవులు వస్తున్న నేపథ్యంతో పాటు పల్లెవెలుగులు, ఎక్స్‌ప్రెస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణం దృష్ట్యా రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచుతున్నారు. అయా డిపోల పరిధిలో ఎన్ని బస్సులు నడిపించాలనే దానిపై ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. ప్రత్యేక బస్సుల్లో ఎక్స్‌ప్రెస్‌లతో పాటు సూపర్..

- మిగతా 7వ పేజీలో...



దొంగతనాల నివారణకు
పటిష్ఠ నిఘా

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దొంగతనాల నివారణకు పటిష్ఠ నిఘా, ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దొంగతనాల నివారణకు పగలు, రాత్రి పటిష్ఠంగా గస్తీ నిర్వహించాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వారిపై నిఘా పెట్టాలన్నారు. ప్రతి కాలనీలోని ముఖ్యమైన కూడళ్లలో, రహదారుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు సైతం అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానం వస్తే వెంటనే సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందించాలని సూచించారు. ప్రజలు విలువైన వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని, సుదూర ప్రాంతాలకు వెళ్లే ముందు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్న సమయంలో అపరిచితులుచెప్పే సమాచారాన్ని నమ్మవద్దన్నారు. అత్యవసర సమయాల్లో సహాయం పొందేందుకు డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీ రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి



నల్లగొండ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మంత్రులు సీతక్క, కొండా సురేఖతో కలిసి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కొత్త విద్యుత్ పాలసీ కోసం ఇంధనశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ మధ్య కుదిరిన ఒప్పందంతో 1,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఒక్కో మెగావాట్‌కు నాలుగు ఎకరాల చొప్పున ప్రతీ జిల్లాలో కనీసం 100 నుంచి 150 ఎకరాలకు తగ్గకుండా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని ఇదివరకే కలెక్టర్లను ఆదేశించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు 11 ప్రాంతాల్లో 270 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్టు తెలిపారు. సదరు భూములను ఇప్పటికే రెవెన్యూ, ఫారెస్ట్, ఇతర అధికారులు ఉమ్మడిగా పరిశీలించినట్టు తెలిపారు. ఆదివారంలోగా మరోమారు పరిశీలించి ఆ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై నివేదిక అందజేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశమై పవర్ ప్లాంట్లకు భూసేకరణపై సమీక్షించారు. వెంటనే సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు భూమిని గుర్తించడంతోపాటు, ఆర్థికపరమైన చేయూతకు బ్యాంకు అధికారులతో ప్రత్యక్షంగా మాట్లాడాలని అన్నారు. సమావేశంలో అటవీశాఖ జిల్లా అధికారి రాజశేఖర్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, రెడ్‌కో జిల్లా మేనేజర్ ఎం.పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

(ఆంధ్రజ్యోతి, కేతేపల్లి): 'ధరణి' పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. బుధవారం కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ధరణి దరఖాస్తులు, మ్యుటేషన్, తదితర పెండింగ్ తదితర అంశాలను పరిశీలించారు. పారిశుధ్యం, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే, డేటా ఎంట్రీపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ధరణి, ఇతర భూ సంబంధిత దరఖాస్తులు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అదే సమయంలో ఎలాంటి సమస్యలేకున్నా పదేపదే ఫిర్యాదులతో వచ్చే బోగస్ దరఖాస్తుదారులపై కూడా దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, డీటీ సత్తార్, ఎంపీవో నాగలక్ష్మి, ఆర్ఐ చాంద్‌పాషా, తదితరులు ఉన్నారు.

పశుగణన సర్వేను పూర్తి చేయాలి

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఖాద్రీ



రికార్డులను తనిఖీచేస్తున్న జిల్లా పశువైద్యాధికారి ఖాద్రీ

మర్రిగూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పశుగణన సర్వేను ఫిబ్రవరి చివరి నాటికి వందశాతం పూర్తి చేయాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఖాద్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్య ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వైద్యసిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పశువైద్య సేవలు అందించాలని సూచించారు. పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గత డిసెంబరులో పశువులు, గొర్రెలకు టీకాలు వేశామని, మిగిలిన జీవాలకు సైతం త్వరలో టీకాలు వేస్తామని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ సురేందర్, ఎల్లేష్, తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



చింతపల్లిలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న శ్రీనివాస్

చింతపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారిస్తే ఎలాంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండదన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, మండల వైద్యాధికారులు శ్రీదేవి, ఇక్బాల్, తదితరులు ఉన్నారు.

● ఇదిగో.. బోండా తెగ





అంతరించిపోతున్న గిరిజన జాతి బోండా తెగ జీవనశైలిపై ఒడిశా రాష్ట్రంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించిన వర్క్ షాప్‌లో నకిరేకల్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ మనోహర్ తీసిన ఫొటోకు జాతీయస్థాయి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మనోహర్‌ను ఎమ్మెల్యే వీరేశం సన్మానించారు.

● నకిరేకల్

భూనిర్వాసితులకు పునరావాసం

చింతపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు కింద ముంపునకు గురైన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటుందని అడిషనల్ జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చింతపల్లిలో మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం, నర్సిరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా లబ్ధిదారులకు 289 ప్లాట్లు మంజూరు చేశామని, వీటిలో 257 ప్లాట్లు అందించినట్లు తెలిపారు. ప్రాజెక్టు పనుల్లో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం ఇళ్ల స్థలాలు అందించి భరోసా కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ద్వారా అన్ని గ్రామాలకు సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. రైతు సంక్షేమానికి ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్నామని అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, చింతపల్లి, మర్రిగూడ తహసీల్దార్లు రమకాంత్ శర్మ, బి.శ్రీనివాస్, ఆర్ఐ సునీత, ఈఈ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

కొండమల్లేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) కొండమల్లేపల్లి మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ బీసీ గురుకుల పాఠశాలల్లో 5వతరగతితో పాటు 6,7,8,9 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శౌరీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అర్హత పరీక్ష ఫిబ్రవరి 23న నిర్వహించనున్నట్లు సూచించారు.

త్రిపురారం మండల ప్రత్యేకాధికారిగా లీల



త్రిపురారం జనవరి 8(ఆంధ్రజ్యోతి): గ్రామా ల్లో సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ వి.లీల సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారిగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పథకాల అమలు తదితర అంశాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా వివిధ శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాన్నారు ఆమె వెంట ఎంపీడీవో విజయకుమారి, ఎమ్మార్వో ప్రమీల, ఎంఈవో రవికుమార్ ఉన్నారు.

మాడ్గులపల్లి తహసీల్దార్‌గా సురేష్



మాడ్గులపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల నూతన తహసీల్దార్‌గా ఎస్.సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అడవి దేవుల పల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న సురేష్ బదిలీపై మాడ్గులపల్లికి రాగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పద్మ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ సురేష్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సాయం

దేవరకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని 18వ వార్డుకు చెందిన బొమ్ము రామలింగం కిడ్నీ వ్యాధితో ఇబ్బందులుపడుతున్నాడు. దీంతో స్థానిక కౌన్సిలర్, భారత యాదవసంఘం మహిళ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొండ్ర మల్లేశ్వరీ శ్రీశైలం యాదవ్ అత డి వైద్య ఖర్చుల కోసం రూ.10వేలు బుధవారం అందజేశారు.

హాలియా దవాఖానా పూర్తయ్యేదెప్పుడో



హాలియా పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల దవా ఖానాగా ఉన్నతీకరిస్తూ గత ప్రభుత్వం శంకుస్థాపన చేశారు. అయి తే 60 శాతం పనులు పూర్తి కాగా మిగిలిన పనులు పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- హాలియా-(ఆంధ్రజ్యోతి)

నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం

» పీహెచ్‌సీని 30 పడకల దవాఖానాగా ఉన్నతీకరిస్తూ గత ప్రభుత్వం శంకుస్థాపన

» ఇప్పటికే 60 శాతం పనులు పూర్తి..

దినదినాభివృద్ధి చెందు తున్న హాలియా నాగార్జునసాగర్ నియో జకవ ర్గానికి కేంద్ర బిందువు. 2018 సంవత్సరంలో హాలియా నూతన మున్సి పాలిటీగా ఏర్పాటైంది. 22 వేల మంది జనాభా నివసిస్తుండగా మరో వైపు పరిసర ప్రాంతాల కోసం నిత్యం హాలియాకు వస్తూ పోతుంటారు. ఇక్కడ పేదల కోసం 2012లో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా ప్రారంభించారు. ఆ తర్వాత 2023లో హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉన్నతీకరించి సామాజిక ఆరోగ్య కేంద్రంగా అనగా 50 పడకల ఆస్ప త్రిగా(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)గా నాటి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ మారుస్తూ శంకుస్థాపన చేశారు. 50 పడకల ఆస్పత్రికి సుమారు రూ.9 కోట్లతో పనులు నిర్వహి స్తున్నారు. నేటికి పనుల్లో 60 శాతం భవ నానికి సంబంధించిన పనులు పూర్తయి నత్తనడకగా కొన సాగు తూ పేద ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు మాత్రమే అందడంతో ప్రైవేటు ఆస్పత్రి వారికి దిక్కై ంది. దీంతో నిత్యం ఇక్కడికి నివసిస్తున్న ప్రజలు ఇబ్బ దులు ఎదుర్కొంటున్నారు. భవనం పూర్తి చేసి అప్పగిస్తే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అవసరమైన వైద్య సిబ్బందిని, ఆధునాతన పరికరాలు, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని జిల్లా వైద్యాధికారులు పేర్కొం టున్నారు. ఆస్పత్రి త్వరగా పూర్తి చేసి త్వరగా అందు బాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పీహెచ్‌సీ పోస్టులు ఖాళీ

హాలియా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో కూడా పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలకు 24 గంటల సేవ లు అందుబాటులో లేకుండా ఉన్న పరిస్థితి. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నైట్ స్టాఫ్ నర్సు-1, సెకండ్ ఏఎన్ఎం-1, హెల్త్ అసిస్టెంటర్ ఫిమేల్ 5, మేల్ 3 ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పేద ప్రజలకు అందుబాటులోకి తేవాలి



యువ నాయకులు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి,ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి త్వరగా 50పడకల ఆస్పత్రి వేగంగా పూర్తి చేయించాలి.అవసరమైన వైద్య సేవలు, వైద్య సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

- మిట్టపల్లి వాసులు, అనుముల

రెండు నెలలో పూర్తి చేస్తాం,

ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేం దుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవతో పని చేస్తుందని. ఇటీవల సమావేశం కూ డా నిర్వహించాం. ఇప్పటికే 60 శాతం పైగా పనులు పూ ర్తి చేశాము మరో రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తాం

- జైపాల్‌రెడ్డి,ఈఈ

ప్రజల భాగ స్వామ్యంతోనే ప్రమాదాల నివారణ

● ఎల్. వీరాస్వామి, ఎంవీఐ, మిర్యాలగూడ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. అందులో భాగంగా భద్రతపై అవగాహన కల్పిస్తూ ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తోంది. ఈసందర్భంగా ఎంవీఐ వీరాస్వామి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ కార్యక్రమాల గురించి వివరించారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ఆంధ్రజ్యోతి: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఎంవీఐ: సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్‌చేయడం, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, డంకెన్‌డ్రైవ్, ఓవర్‌స్పీడ్ లాంటి కూడదని రద్దీ ప్రదేశాల్లో, కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి వాహనదారులకు అవగా హన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: డ్రైవర్ల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

ఎంవీఐ: ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, స్కూల్ బస్సుల, లారీల డ్రైవర్లతో పాటు ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మిర్యాలగూడ ఎంవీఐ పరిధిలోని 12 మండల్లాల్లో డ్రైవర్ల అసోసియేషన్ల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి సైట్ ఉన్నవారికి కళ్లజోడు అందజేసేందుకు యత్ని స్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు అవేర్‌నెస్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నారా?

ఎంవీఐ: పాఠశాలల్లో 5వ తరగతి చదివే విద్యార్థుల నుంచి డిగ్రీ విద్యార్థుల వరకురోడ్డు భద్రతా సూచికల గురించి వివరిస్తున్నాం. యూనిసెఫ్, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్కూల్స్‌లో 2000 ఎస్ఎఫ్‌టీలో చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సేఫ్టీ గురించి తెలిసే విధంగా కార్యక్రమానికి రూపకల్పన జరుగుతోంది.

ఆంధ్రజ్యోతి: ప్రజల భాగస్వామ్యం కోసం ఏం చర్యల తీసుకుంటున్నారు?

ఎంవీఐ: స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీస్, రవాణాశాఖ సంయుక్తంగా అన్ని చోట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే రోడ్డు భద్రతపై పోస్టర్లు, బ్రోచర్లు విడుదల చేసి 6 చోట్ల కార్యక్రమాలు నిర్వహిచాం.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నిడమనూరులో కల్యాణ లక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం నిడమనూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్న తమ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ప్రభుత్వం పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, మాజీ జడ్పీటీసీ నందికొండ రామేశ్వరి మట్టారెడ్డి, ముంగి శివమారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగు విజయ్‌కుమార్, ఉన్నం చినవీరయ్య, బొల్లం శ్రీనివాస్‌యాదవ్, మోసాల శ్రీను, చర్క శ్రీను, గడ్డం గోవిందరెడ్డి, వెంకటరమణ, మైసయ్య, కంచి పాపయ్య, ఆర్ఐ రాజిరెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

త్రిపురారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 72 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక రైతు వేదికలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి బుధవారం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌నాయక్,రవికుమార్, సోమయ్య, ప్రమీల, మట్టయ్య పద్మ, సైదులుగౌడ్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



దేవరకొండలో శ్మశానవాటిక నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమానికి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తు దని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని పెద్దదర్గా సమీపంలో మైనార్టీల శ్మశానవాటిక నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. శ్మశానవాటిక నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఆయన వెంట దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎండీ .యూనుస్, వెంకటయ్యగౌడ్, లోకసాని శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

డిండి,(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని ఐబీ క్వాటర్స్ నుంచి షీడు ఫాం వరకు నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులకు ఎంపీ రఘువీర్‌రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేయనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వర రావు బుధవారం తెలిపారు. అంగడిబజార్‌లో సెంట్రల్ లైటింగ్‌తో కూడిన డివైడర్‌ను ఏర్పాటు చేసి రెండో వైపుల సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు అయన తెలిపారు. అందు కోసం రూ.3 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతో పాటు స్త్రీనిధి, మత్స్యశాఖ ద్వారా రాయితీతో అందిస్తున్న సంచార చేపల విక్రయ వాహనాన్నిలబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

కొండమల్లేపల్లి, జనవరి 08 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి ప్రాజెక్టు సెక్టార్ పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి, దోనియాల అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణవేణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ నిర్వహిస్తున్న తీరు, ఫుడ్ స్టాక్ వివ రాలను పరిశీలించా రు. అమలవుతున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల చేత వర్క్ బుక్ రాయించాలని, డ్రాయింగ్ కలర్స్ వేయించాలని పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఏసీడీపీవో పి.సరళ, సూపర్‌వైజర్ మంజుల తదితరులున్నారు.

108 ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి

మాడ్గులపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా సూపర్‌వైజర్ మధు అన్నారు. బుధవారం ఆయన మాడ్గులపల్లిలో 108 వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఔషధాలు, పరికరాలు వాటి ఉపయోగం, ఏఈడీ సక్రమమైన పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో 108 వాహనం 24గంటలు అందుబాటులో ఉంటున్నందున అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీరొద్దిన్, ఈఎంటీ వెలిజాల సైదులు, పైలట్ ధీరావత్ అరుణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు 8 గంటలు నిద్రపోవాలి

హాలియా, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కనీసం 8 గంటలు నిద్రపోవాలని డాక్టర్ రాంబాబు, రజిత తెలిపారు. బుధవారం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వారానికి ఒకసారి చేతి గోళ్లను కట్ చేసుకోవాలని, కనీసం 8 గంటల పాటు నిద్రపోవాలని ఇది వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సర్వే తెలుపుతుందని అని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో పశు వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న చైర్మన్ సత్యం

నిడమనూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్వతీపురం గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నిడమనూరు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించినపశు వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి తోట చందర్‌రావు, నందికొండ మట్టారెడ్డి, ముంగి శివమారయ్య, చినవీరయ్య, వంకా బ్రహ్మన్న, మద్దిపూడి రాంబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సపావత్‌తండాలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

తిరుమలగిరి(సాగర్), జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని సపావత్‌తండాలో గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఎస్‌పీఎల్-3 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ సపావత్ జామ్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25,116లు, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ బహుమతి రూ.10,116లు అందిం చను న్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 88857848838, 7780746174 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మా భూమి మాకు ఇప్పించండి

మిర్యాలగూడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భూరికార్డుల్లో అవకతవకలు చేసి మా భూమిని ఆక్రమించుఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉబ్బపల్లి రాములమ్మ కోరారు. ఈ మేరకు బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే నెంబర్ 710, 711లో మాకు మా పాలి వాండ్లకు 16 ఎకరాల 36 గుంటల భూమి ఉండగా పాలివాండ్లు అందరు కలిసి కొంత భూమిని విక్రయించినట్లు చెప్పారు. మా అత్త ఉబ్బపల్లి లచ్చమ్మ పేరున వున్న సర్వే న ంబర్ 711/అ లో 31 గుంటల భూమిని ఎవరికీ విక్రయించలేదన్నారు. 2018 వరకు పహనీలో లచ్చమ్మ పేరు నమోదైవుతుందన్నారు. అట్టి భూమిని 2013 ఆగస్టు వరకు సేద్యం చేస్తూ కబ్జాలోనే ఉన్నామని చెప్పారు. కాగా దళితులమైన మమ్ములను బెదిరించి దౌర్జన్యంతో పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి భూమి చుట్టూ ప్రహరీని నిర్మించారని ఆరోపించారు. ఆ భూమిపైకి వెళితే మమ్మల్ని కులం పేరుతో దూషించి మాపై దౌర్జన్యం చేయడానికి యత్నిస్తున్నారని చెప్పారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి భూరికార్డులను తారుమారు చేసి మాపై దౌర్జన్యానికి యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు

పట్టాలు మంజూరు చేయాలి

అడవిదేవులపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూములకు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ యువజన కాంగ్రెస్ మండల నాయకుడు కొర్ర అశోక్‌నాయక్ బుధవారం నల్లగొండలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినిపత్రం అందచేసి మాట్లాడారు. తాతల కాలంగా రైతులు భూముల ఆధీనంలో ఉండి సాగు చేసుకుంటున్నారని, వాటికి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వల్ల పట్టాలు లేకుండా ఆగిపోయాయని అన్నారు. రైతులకు పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం అందించే సహాయాన్ని పొందలే కపోతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం మండలంలో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి పట్టాలు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

కక్ష సాధింపుతోనే కేటీఆర్‌పై కేసులు

తిరుమలగిరి(సాగర్), జనవరి 8(ఆంధ్రజ్యోతి): కక్ష సాధింపుచర్యలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కేటీఆర్‌పై కేసులు బనాయించేలా చూస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిడిగం నాగయ్య అన్నారు. ఆయన మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దీన్ని పక్కదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కేసులు మోపాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే తగిన విధంగా బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు జటావత్ రమేష్, నాయకులు బానావత్ శివ, రమావత్ కిషన్, ముని, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పనులను అడ్డుకుంటున్నాడని ఆందోళన



కన్నెకల్- ముషంపల్లి రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండ లంలోని కన్నెకల్-ముషంపల్లి రోడ్డుపై రైతులు తాటిచెట్లు వేసి బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మా ట్లాడుతూ ఎస్ఎల్‌బీసీ, 24ఆర్ కాల్వ నుంచి చెరువులోకి పంట సాగు కోసం తీసే కాల్వ పనులను ఓ రైతు చేపట్టకుండాఅడ్డుకుంటున్నాడని, ఆ కాల్వ తీస్తే నాలుగు చెరువులు నిం డుతాయని అన్నారు. గత వేసవికాలంలో సాగునీటి కోసం తీవ్ర ఇబ్బం దులు పడ్డామని, అదే డీ-37 కాల్వ 24 ఆర్ ద్వారా రెండు తూములు వస్తున్నాయని, మూడో తూము తీయాలనుకుంటే సదరు రైతు అడ్డుపడుతుండడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు సర్ధిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను మార్చాలి

మిర్యాలగూడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను మార్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా ఏర్పాటైన బీసీ సంక్షమ సంఘం సమావేశంలో విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటికే ప్రకటించిన పీఆర్టీయూ అభ్యర్థి పింగళి శ్రీనివాసరెడ్డి, యూటీఎఫ్ నర్సిరెడ్డి, టీపీఆర్టీయూ హర్షవర్ధన్‌రెడ్డి అభ్యర్థిత్వాలను మార్చాలన్నారు. అన్ని సంఘాలు అగ్రవర్ణ అభ్యర్థులనే ఎంపిక చేయడం విచారకరమన్నారు. బడుగు బల హీన వర్గాల ఉపాధ్యాయ నేతలు బయటకు వచ్చి బీసీ అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలిపి తమ సత్తా చాటాలని కోరారు.

బీజేపీ కార్యాలయంపై దాడిని నిరసిస్తూ ధర్నా

మిర్యాలగూడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని ఖండిస్తూ ఆ పార్టీ నాయకులు స్థానిక బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించి కాంగ్రెస్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్ చార్జి సాధినేని శ్రీనివాసరావు, పట్టణశాఖ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి మాట్లాడుతూ బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం హేయం మన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనపర్తి సత్యప్రసాద్, బంటు సైదులు, ఎడ్ల రమేష్, సజ్జల నాగిరెడ్డి, కొండేటి సరిత, పురుషోత్తం, చల్లమల్ల సీతారాంరెడ్డి రాజశేఖర్‌నాయక్, సత్యనారాయణ, శ్యామ్ పాల్గొన్నారు.

దాడి అప్రజాస్వామికం

వేములపల్లి, (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణల దాడికి పాల్పడడం అప్రజాస్వామికమని బీజేపీ మండలాధ్యక్షుడు చిర్ర సాంబమూర్తియాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పార్టీ కార్యాలయంపై కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేయడం సమంజసం కాదని అన్నారు. కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు పందిరి భాగ్యమ్మ, నాయకులు కర్ర దామోదర్‌రెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, శ్రీరామోజు రవి, మధు, లక్ష్మీ పాల్గొన్నారు.



మిర్యాలగూడ బస్టాండ్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

● పెద్దఅడిశర్లపల్లి,(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు మల్గిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పోరాడుతాం అని మా సహనాన్ని పరీక్షిస్తే తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోతెం కరుణాకర్, మండల ప్రధాన కార్యదర్శి వరికుప్పల శ్రీరాములు, గుండాల శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పాటు పాడాలి

హాలియా, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని ఎంఈవో గుండా కృష్ణమూర్తి అన్నారు. బుధవారం అనుముల ఉన్నత పాఠశాలలో తపస్ సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు గుర్రం ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రేణుకుంట్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి గుర్రం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీఉన్నత పాఠశాలలో బుధవారం టీపీయూఎస్ క్యాలెండర్‌ను ఎంఈవో నాగేశ్వర్ రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమిరే సైదులు, అంజయ్య, సరస్వతి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు